





# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 24 సెప్టెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 47 పేజీలు : 4 వెల : రూ 3-00


## అక్రమంగా మద్యం తయారీ పై ఉక్కుపాదం : సీఎం జగన్



అమరావతి: అక్రమంగా మద్యం తయారీ, రవాణాపైన ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. మద్యం అక్రమ రవాణా, తయారీకి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఇదివరకే చట్టాన్ని తీసుకు వచ్చామని, దీన్ని అమలు చేయాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యకలాపాల ప్రగతిపై అధికారులు సీఎం వైఎస్ జగన్‌కు వివరాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. మద్యం నియంత్రణలో భాగంగా రేట్లను పెంచామని వెల్లడించారు. మూడింట ఒక వంతు దుకాణాలను మూసివేశామని, బెల్టుషాపులను,పర్మిట్‌రూమ్‌ల తీసేశామని తెలిపారు. లిక్కర్ అమ్మకాలు నెలకు 34 లక్షల కేసుల నుంచి 21 లక్షల కేసులకు తగ్గాయని పేర్కొన్నారు. బీరు అమ్మకాలు నెలకు 17 లక్షల కేసుల నుంచి 7 లక్షలకు తగ్గాయన్నారు. ఇలాంటి సందర్భంలో అక్రమంగా రవాణా అవుతున్న మద్యాన్ని, మద్యం తయారీని అడ్డుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇసుకను నిర్దేశించిన రేట్లకన్నా ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే మరిన్ని రీచ్‌లు, డిపోల సంఖ్య పెంచేలా చూడాలన్నారు. ఎస్ఈబీ కాల్‌సెంటర్ నంబర్‌పై బాగా ప్రచారం చేయాలన్నారు. అధిక రేట్లకు ఎవరైనా అమ్మితే వెంటనే వినియోగదారులు ఆ నంబర్‌కు కాల్‌చేసేలా ప్రచారం చేయాలని, సంబంధిత జిల్లాల వారీగా ఈ ప్రచారం చేయాలని సూచించారు. వచ్చే కాల్స్‌పై సత్వరమే స్పందించి అధికారులు చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా అధికారులు దీనిపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఆ జిల్లాల్లో రేట్ల వివరాలను తెలియజేస్తూ అడ్వర్టైజ్‌మెంట్ ఇవ్వాలని, అంతకన్నా ఎక్కువ ధరకు ఎవరైనా విక్రయిస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఏ కాలేజీలోనైనా అలాంటి ఉదంతాలు కనిపిస్తే.. అక్కడ ప్రత్యేక దృష్టిపెట్టాలి. క్రమం తప్పకుండా విశ్వవిద్యాలయాలు, కాలేజీలపైన పర్యవేక్షణ ఉండాలి. కార్యాచరణ తయారుచేసి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి. ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నామో వచ్చే సమావేశంలో తెలియజేయాలి. ఆరోగ్యానికి అత్యంత హానికరంగా మారిన గుట్కా విక్రయాలు, రవాణాపైన దృష్టిపెట్టాలి. ఎస్ఈబీ కార్యకలాపాలు:మద్యం అక్రమ రవాణా, తయారీలకు సంబంధించి ఇప్పటివరకూ 1,20,822 కేసులు నమోదు 1,25,202 మంది నిందితుల

### స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోపై సీఎం జగన్ సమీక్ష

అరెస్టు 2020లో 63,310 కేసులు నమోదు 2021లో 57,512 కేసులు నమోదు 74,311 కేసులు నమోదు చేసిన ఎస్ఈబీ 46,511 కేసులు నమోదు చేసిన పోలీసులు 8,30,910 లీటర్ల అక్రమ మద్యం సీజ్ 8,07,644 లీటర్ల నాటుసారా స్వాధీనం 2,30,48,401 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం 29,491 వాహనాలు సీజ్ఇసుక అక్రమ రవాణా ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 12,211 కేసులు నమోదు 22,769 మంది నిందితుల అరెస్టు 5,72,372 టన్నుల ఇసుక స్వాధీనం16,365 వాహనాలు జప్తుగంజాయి సాగు, రవాణాకు సంబంధించి 220 కేసులు నమోదు 384 మంది అరెస్టు?18,686 కేజీల గంజాయి స్వాధీనం?మార్చి 20, 2021 నుంచి మార్చి 31, 2021 మధ్య ఆపరేషన్ నయా సవేరా కింద స్పెషల్ ఆపరేషన్?69 కేసులు నమోదు, 174 మంది అరెస్టు 2176 కేజీల గంజాయి స్వాధీనం 3.065 ఎండీఎం స్వాధీనం 330 అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహించామని తెలిపిన అధికారులు. ఈ సమీక్షా సమావేశానికి ప్లానింగ్ అండ్ రిసోర్స్ మొబలైజేషన్ స్పెషల్ సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, డీజీపీ గౌతమ్ సవాంగ్, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ ఎస్ రావత్, ఇంటెలిజెన్స్ చీఫ్ కే వీ రాజేంద్రనాథ్ రెడ్డి, గనులశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్, ఎస్ఈబీ కమిషనర్ వినీత్ బ్రిజ్‌లాల్, ఎస్ఈబీ డైరెక్టర్ (స్పెషల్ యూనిట్స్) ఏ రమేష్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ‘అమెరికన్ కార్నర్’ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం జగన్



విశాఖపట్నం: ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)లో ఏర్పాటు చేసిన ‘అమెరికన్ కార్నర్’ కేంద్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ఏయూలో అమెరికన్ కార్నర్ ఏర్పాటు కావటం సంతోషకరమని అన్నారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అహ్మదాబాద్,హైదరాబాద్ తర్వాత విశాఖలో అమెరికన్ కార్నర్ ప్రారంభమైందని తెలిపారు. దేశంలో మూడో కేంద్రంగా.. అమెరిన్ కాన్సులేట్ సహకారంతో విశాఖలో ‘అమెరికన్ కార్నర్’ ఏర్పాటు చేశారు. యూఎస్ విద్య, ఉద్యోగావకాశాల సమాచారానికి సంబంధించి సేవలు అందించనుంది. ఈ కార్యక్రమంలో అమెరికన్ కాన్సులేట్ జనరల్ జోయల్ రీఫ్‌మెన్, యూఎస్ ఎయిడ్ ఇండియా డైరెక్టర్ వీణా రెడ్డి, ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణ తాత్కాలిక ఉద్యోగులకు ఏపీ షాక్



అమరావతి: తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన తాత్కాలిక ఉద్యోగులకు ప్రభుత్వం వసతి సౌకర్యం కట్ చేసింది. సచివాలయం, అసెంబ్లీ, హెచ్‌ఓడీ విభాగాలకు చెందిన ఉద్యోగులకు వచ్చే నెల నుంచి ఉచిత ట్రాన్సిట్ వసతిని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ 1 నుంచి ఉద్యోగులు సొంత ఖర్చులతో వసతి భరించాలని స్పష్టం చేసింది. అక్టోబర్ 31 వరకు మాత్రమే ఉద్యోగులకు ఉచిత ట్రాన్సిట్ వసతి కల్పించనుంది. ఇప్పటివరకు షేరింగ్ ప్రాతిపదికన ఉచిత వసతి కల్పించింది. కాగా రాష్ట్ర విభజనకు

ముందు హైదరాబాద్‌లో ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక ఉద్యోగులుగా వీరంతా పని చేశారు. విభజన తర్వాత అమరావతికి షిఫ్ట్ అయ్యారు. అప్పటి నుంచి వారికి ప్రభుత్వమే ఉచిత ట్రాన్సిట్ వసతి కల్పించింది. తాజాగా జగన్ సర్కార్ తీసుకున్న నిర్ణయంతో వీరందరికి షాక్ తగిలినట్లైంది.

## ఆళ్లగడ్డ లో జాబ్ మేళా

### మూడు వందల ఇరవై మందికి ఉద్యోగాలు.




ఆళ్లగడ్డ ::(విభారె న్యూస్) ఆళ్లగడ్డ పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి కళాశాలలో డి.ఆర్.డి.ఎ మరియు స్పీడప్ సంస్థల ఆధ్వర్యంలో నిరుద్యోగుల కొరకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళా లో 806 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీలు నిర్వహించిన ఎంపిక పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 320 మంది నిరుద్యోగులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గూగుల్ కంపెనీ 156 మంది, హానర్ ల్యాబ్స్ 26 మంది, మెడ్ ప్లస్ 26 మంది, అమర రాజా బ్యాటరీస్ 28 మంది, టెక్ మహీంద్రా 83 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ జాబ్ మేళా కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ డి దానం, ఏ పి ఎం రామ శేఖర్ రెడ్డి మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఇలాంటి జాబ్ మేళా లు నిర్వహించడం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించిన డి ఆర్ డి ఎ మరియు స్పీడ్ అప్ సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ‘రాజకీయ లబ్ధి కోసం భయానక వాతావరణం సృష్టించారు’

### హోంమంత్రి మేకతోటి సుచరిత

గుంటూరు: పక్కా ప్లాన్‌తోనే టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి చేశారని హోంమంత్రి



మేకతోటి సుచరిత మండిపడ్డారు. పెదనండిపాడు మండలం కొప్పర్రులో హోంమంత్రి మేకతోటి సుచరిత పర్యటించారు. టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేతలను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొప్పర్రులో వినాయక నిమజ్జనానికి వైఎస్సార్‌సీపీ నేతలు సహకరించారని తెలిపారు. టీడీపీ నేతలు ముందుగానే ఇంటిపై రాళ్లు సిద్ధం చేసుకున్నారని అన్నారు. బత్తుల శారద ఇంట్లోకి వెళ్లి టీడీపీ నేతలే దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నేత శ్రీకాంత్‌పై కూడా టీడీపీ నేతలు దాడి చేశారని ఫైర్ అయ్యారు.

## ‘హెరాయిన్’ బిగ్‌బాస్ ఎవరో తేల్చండి: దేవినేని ఉమ



విజయవాడ: రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల హెరాయిన్ అక్రమ రవాణా వెనుక ఉన్న బిగ్‌బాస్ ఎవరో కేంద్ర నిఘా సంస్థలు తేల్చాలని మాజీ మంత్రి దేవినేని ఉమ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ రూ.72 వేల కోట్ల విలువచేసే హెరాయిన్ పట్టుబడినట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్న పోర్టులు తెలుగు వారి అధీనంలో ఉండగా.. రెండేళ్లలో వాటన్నింటినీ ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ఆఖరికి నెత్తిమీద జుట్టును కూడా స్మగ్లింగ్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పేదలకు ఇచ్చే రేషన్ తక్కువకు కొనుగోలు చేసి కాకినాడ పోర్టు నుంచి తరలిస్తున్నారని.. దీనిపై మంత్రులు, ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మత్తు మందు కారణంగా రాష్ట్రంలో దాడులు పెరిగాయని చెప్పారు. అధికారుల కారుల్లోనే మత్తుమందు డబ్బులు విచ్చలవిడిగా రవాణా అవుతోందని ఆయన ఆరోపించారు.

## కొప్పర్రు లో హోంమంత్రి పర్యటన

గుంటూరు ప్రత్తిపాడు నియోజకవర్గం కొప్పర్రు గ్రామంలో గాయపడిన వైస్సార్సీపీ నాయకులను హోంమంత్రి సుచరిత పరామర్శించారు. తరువాత ఆమె మీడియాతో మాట్లాడారు. పెదనందిపాడు మండలం కొప్పర్రు లో టీడీపీ నాయకులపై దాడి అని అవాస్తవాలను ప్రచారం చేశారు. రాళ్లు, కర్రలు, కారం తో టీడీపీ కార్యకర్తలు వైస్సార్సీపీ వాళ్లపై దాడి చేసారు. టీడీపీ



వాళ్ళ దాడిలో దాదాపు పది మంది వైస్సార్సీపీ నాయకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వినాయక నిమజ్జనం చేసి వస్తున్న వైస్సార్సీపీ నాయకులతో కావాలనే టీడీపీ వాళ్ళు గొడవకు దిగారు. దాదాపు 40 మంది టీడీపీ వాళ్ళు వైస్సార్సీపీ వాళ్లపై కర్రలతో దాడి చేశారు. టీడీపీ వాళ్ల దాడిలో వైస్సార్సీపీ నాయకుడు ఇంటూరి హనుమంతరావు కు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రశ్నించడానికి వెళ్లిన హనుమంతరావు కుమారుడు ఇంటూరి శ్రీకాంత్ ను టీడీపీ ఎక్స్ జడ్పీటీసీ ఇంట్లోకి లాక్కెళ్లి చితకొట్టారు. శ్రీకాంత్ ను రక్షించడానికి వెళ్లిన వైస్సార్సీపీ నాయకులపై మరోసారి రాళ్లతో, కర్రలతో దాడి చేసినట్లు చెబుతున్నారు. ఆ క్రమంలో టీడీపీ నాయకుడి ఇంట్లోని ఒక సోఫా తగలబడటం జరిగింది. గాయాలపాలయిన వైస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులను స్థానిక పోలీసులు అంబులెన్స్ లో హాస్పిటల్ కు తరలించారు. దాడి చేసిన టీడీపీ వాళ్ళే తిరిగి వైస్సార్సీపీ నాయకులపై కేసులు పెట్టారు. టీడీపీ నాయకులపై దాడి, ఇంటిని ధ్వంసం చేసారు అని టీడీపీ వాళ్లే మీడియాలో అసత్య ప్రచారాన్ని ప్రచారం చేయించారు. వాస్తవ విషయాలు సమాజానికి, మీడియా కు తెలియాలనే నేను కొప్పర్రు గ్రామానికి రావడం జరిగింది. ప్రశాంతమైన కొప్పర్రు గ్రామంలో కావాలనే టీడీపీ నాయకులు విధ్వంసం సృష్టించాలని చూస్తున్నారు. కొప్పర్రు లో దాడికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హోంమంత్రి సుచరిత పోలీసులకు సూచించారు. మీడియా ప్రతినిధులు కూడా వాస్తవాలను ప్రసారం చేయాలని హోంమంత్రి సుచరిత కోరారు. భవిష్యత్తులో కొప్పర్రు గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా వుండాలని హోంమంత్రి విజ్ఞప్తిచేశారు.

## సుస్థిర ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం, పరిశ్రమల సమన్వయం అవసరం: ఉపరాష్ట్రపతి



న్యూఢిల్లీ: సంస్కరణలను సమర్థవంతంగా అమలుచేయడంలో ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పారిశ్రామిక రంగానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. తద్వారా రానున్న దశాబ్దానికి నిర్దేశించుకున్న సుస్థిర ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో భాగస్వాములు కావాలన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘మిస్టిక్ సౌత్, గ్లోబల్ లింకేజెస్ సమ్మిట్ టువర్డ్స్ 1.5 ట్రిలియన్ డాలర్ ఎకానమి బై 2025’ సదస్సును ఉద్దేశించి ప్రసంగించిన ఉపరాష్ట్రపతి, భారతదేశం అభివృద్ధి పట్టాలు ఎక్కేందుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. ‘ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి’ అని ఆయన సూచించారు. దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతోందన్న ఉపరాష్ట్రపతి, ఇందులో పరిశ్రమల భాగస్వామ్యం కీలకమన్నారు. 2030 నాటికి లక్షల సంఖ్యలో ఉద్యోగాలకల్పన జరగాల్సిన అవసరం ఉందన్నారు. గత దశాబ్దకాలంగా ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న 18 దేశాల సరసన భారతదేశం చోటు దక్కించుకోవడం శుభపరిణామమన్నఆయన, ప్రస్తుతం 8-8.5 శాతంగా ఉన్న జీడీపీ ఇలాగే కొనసాగుతూ, వ్యాపారానుకూల వాతావరణాన్ని మరింతగా ప్రోత్సహించడం కారణంగా ఉత్పత్తి పెరిగి, ఉపాధికల్పన జరిగడం ద్వారా సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కరోనా నేపథ్యంలో.. భారతదేశం మరింత వేగవంతమైన ప్రగతి సాధించేందుకు ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉత్పాదన, డిజిటలీకరణ, అటోమేషన్, పట్టణీకరణ, ఆదాయ పెంపుతోపాటు వ్యవసాయం, వైద్యం, భద్రత తదితర అంశాలపై ప్రత్యేకమైన దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి సూచించారు. కరోనానంతర భారతదేశ ఆర్థిక పురోగతిలో ఈ అంశాలు ఎంతగానో ఉపయుక్తం అవుతాయని ఆయన అన్నారు. భారతదేశంలోని ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకమైన శక్తి సామర్థ్యాలున్నాయని, మరీ ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ద్వితీయ శ్రేణి పట్టణాలకు కూడా చక్కటి అనుసంధానత ఉందని, వీటిన్నింటినీ సద్వినియోగం చేసుకుంటూ సమగ్రాభివృద్ధికి బాటలు వేయాలని ఆయన సూచించారు. తయారీ రంగంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి, డిజిటల్ సేవలు, తర్వాతితరం ఆర్థిక ఉత్పత్తులు, ఉన్నతస్థాయి వసతి సౌకర్యాలు, విద్యుత్తు, ఆధునిక రిటైల్ వ్యాపారం తదితర అంశాలపైనా దృష్టి సారించాలని పేర్కొన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో 54 శాతం వాటాతో సేవారంగం కీలకపాత్ర పోషిస్తోందన్న ఉపరాష్ట్రపతి, కేంద్రప్రభుత్వం చేపట్టిన కరోనా టీకాకరణ కార్యక్రమం మహమ్మారి తర్వాత ఈ రంగం పునరుజ్జీవనానికి ఎంతగానో ఉపయుక్తం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మన దేశంలో 55 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడిన విషయాన్ని గుర్తుచేసిన ఉపరాష్ట్రపతి, ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరంపై దృష్టి సారించాలని సూచించారు. భారతదేశ దక్షిణప్రాంతంలో ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి 1.5 ట్రిలియన్ డాలర్లకు చేరుకునేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవడాన్ని ఆయన అభినందించారు. ప్రతి ప్రాంతంలోని విశిష్టమైన అవకాశాలు, తయారీ, సేవల రంగాల సంయుక్త సామర్థ్యం, భిన్న సంస్కృతుల సమ్మేళనం, విలువలు, విద్యతోపాటు నైపుణ్యం వంటి శక్తిసామర్థ్యాల కారణంగా దక్షిణ భారతం ఈ లక్ష్యాన్ని చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

శుక్రవారం 24 సెప్టెంబరు 2021

## బిగ్ బీల మధ్య పోటీ

గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో అదానీ, అంబానీకి మధ్య పోటీ మొదలయ్యింది. ఇప్పటి వరకు డైరెక్ట్‌గా పోటీ పడని ఈ గుజరాతీలు, ఈ ఏడాది పోటీకి దిగారు. రెన్యువబుల్ ఎనర్జీ సెక్టార్‌లో వచ్చే మూడేళ్లలో రూ. 75 వేల కోట్లు (10 బిలియన్ డాలర్లు) ఇన్వెస్ట్ చేస్తామని రిలయన్స్ ఇండస్ట్రీస్ ముకేష్ అంబానీ ఇప్పటికే ప్రకటించగా, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ వచ్చే పదేళ్లలో 20 బిలియన్ డాలర్లు (రూ. 1.5 లక్షల కోట్లు) ఇన్వెస్ట్ చేస్తామని తాజాగా పేర్కొన్నారు. క్లీన్ ఎనర్జీ కోసం, ఈ సెక్టార్‌కి అవసరమయ్యే ఎక్విప్‌మెంట్ల తయారీ కోసం ఈ పెట్టుబడులను వాడతామని అదానీ చెప్పారు. హైడ్రోజన్ తయారీలో కూడా ఎంటర్ అవుతామన్నారు. గ్లోబల్‌గా రెన్యువబుల్ ఎనర్జీని తయారు చేస్తున్న అతిపెద్ద కంపెనీగా 2030 నాటికి ఎదగాలని అదానీ గ్రీన్ ఎనర్జీ టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందులో భాగంగానే ఈ సెక్టార్‌లో భారీగా ఇన్వెస్ట్ చేస్తామని జేపీ మోర్గాన్ ఇండియా ఇన్వెస్టర్ సమ్మిట్‌లో పాల్గొన్న గౌతమ్ అదానీ అన్నారు. అంతేకాకుండా తమ ఫోకస్ ఎక్కువగా గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌పైనే ఉందనే సంకేతాలను ఇచ్చారు. 2025 వరకు కేటాయించిన క్యాపెక్స్‌లో 75 శాతం వాటాను గ్రీన్ టెక్నాలజీ సెగ్మెంట్‌లో పెడతామని గౌతమ్ అదానీ చెప్పారు. 'వచ్చే 10 ఏళ్లలో రెన్యువబుల్ ఎనర్జీ ప్రొడక్షన్, కాంపోనెంట్ల తయారీ, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వంటి సెగ్మెంట్లలో 20 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేస్తాం' అని ప్రకటించారు. దేశంలో గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో అదానీ గ్రూప్ ముందుంది. ప్రస్తుతం అదానీ గ్రీన్ ఎనర్జీ 25 గిగావాట్ల కెపాసిటీను ప్రొడ్యూస్ చేస్తోంది. గుజరాత్ జామ్‌నగర్‌లోనే రెన్యువబుల్ ఎనర్జీ కోసం అతిపెద్ద ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని ముకేష్ అంబానీ ఇప్పటికే ప్రకటించారు. సోలార్ ఎక్విప్‌మెంట్ల నుంచి ఎనర్జీ స్టోరేజ్, హైడ్రోజన్ ఎనర్జీ కోసం ఎలక్ట్రోలైజ్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కేజీ హైడ్రోజన్‌ను ఒక డాలర్‌కే అమ్ముతామని ప్రకటించారు కూడా. 2030 నాటికి 100 గిగా వాట్ల సోలార్ ఎనర్జీని క్రియేట్ చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. అదానీ ప్లాన్స్ అదానీనిబట్టుంది పెట్టేవే. గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో మరింతగా విస్తరించాలంటే అదానీ అంబానీకి ధీటుగా పెట్టుబడులు పెట్టాల్సిందే. వచ్చే నాలుగేళ్లలో రెన్యువబుల్ ఎనర్జీ కెపాసిటీని మూడింతలు పెంచుతామని గౌతమ్ అదానీ ప్రకటించారు. ఏ కంపెనీ కూడా ఈ స్థాయిలో కెపాసిటీని విస్తరించుచలేదని అన్నారు. గౌతమ్ అదానీ తమ ఇతర బిజినెస్‌ల గురించి మాట్లాడారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్టార్‌పై ఫోకస్ కొనసాగుతుందని, దీనికి రిలేటెడ్ సెక్టార్లలో విస్తరిస్తామని అన్నారు. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లోనే కొత్త బిజినెస్‌లను క్రియేట్ చేస్తామని అన్నారు. 2025 నాటికి నెట్ జీరో ఎమిషన్ కంపెనీగా పెట్టుకున్న టార్గెట్‌ను ఇప్పటికే పోర్టు బిజినెస్ దాటిందని అన్నారు. దేశంలోని తమ డేటా సెంటర్లకు 2030 నాటికి రెన్యువబుల్ కరెంట్‌తో పవర్ సప్లయ్ చేస్తామని చెప్పారు. ఎయిర్‌పోర్ట్స్, డిజిటల్ బిజినెస్‌లను విస్తరించడానికి ప్లాన్స్ ఉన్నాయని, ముంబై ఎయిర్‌పోర్ట్‌ను విస్తరించడంతో పాటు 2024 నాటికి నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. అదానీ డిజిటల్ బిజినెస్‌లో డేటా సెంటర్లు, ఇండస్ట్రియల్ క్లౌడ్స్, డిజిటల్ ల్యాబ్స్ బిజినెస్‌లు ఉన్నాయి. అదానీ గ్రూప్ డేటా సెంటర్ల బిజినెస్ ను వేగంగా విస్తరిస్తోంది. పత్రికా స్వేచ్ఛ ముసుగులో మీడియా ఒక వర్గానికి తలొగ్గకూడదని గౌతమ్ అదానీ పేర్కొన్నారు. మీడియా చేసే విమర్శలు దేశ పరువును తీసేదిగా ఉండకూడదన్నారు. ఇండియా లాంటి దేశంలో కరోనా సంక్షోభాన్ని హ్యాండిల్ చేయడం చాలా కష్టమన్న ఆయన, ప్రభుత్వం చర్యలను సమర్థించారు. దానీ గ్రూపు సంస్థల్లో హవాలా నిధులు వెల్లువపై వచ్చిన కథనాలు ఆ కంపెనీ షేర్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అదానీ గ్రూపు ఇచ్చిన వివరణను మదుపర్లు విశ్వసించలేదు. వరుసగా రెండో రోజూ సెన్సెక్స్, నిఫ్టీల్లో ఆ గ్రూపులోని మూడు కంపెనీ షేర్లు అమ్మకాలతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అదానీ గ్రూపు కంపెనీల్లో భారీ పెట్టుబడులు పెట్టిన మూడు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) ఖాతాల వివరాలను వెల్లడించలేదని.. దీంతో వాటిని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిట్ లిమిటెడ్ (ఎన్‌ఎస్‌డీఎల్) స్తంభింపజేసిందన్న వార్తలు ఆ కంపెనీ సూచీలపై ప్రతికూల ప్రభావాన్ని కొనసాగించాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఇఇఎల్) అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎజిఇఎల్) వరుసగా 2.4 శాతం, 2.8 శాతం చొప్పున రికవరీ అయ్యాయి. ఇంతక్రితం సెషన్‌లో ఈ సూచీలు దశాబ్ద కాలంలో ఎప్పుడూ లేని పతనాన్ని ఎదుర్కొన్న విషయం తెలిసిందే.మరోవైపు అదానీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ (ఎటిఎల్), అదానీ పవర్ లిమిటెడ్ (ఎపిఎల్), అదానీ టోటల్ గ్యాస్ (ఎజిఇఎల్) సూచీలు 5 శాతం క్షీణతతో లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్‌లో ఎటిఎల్ రూ.1441.40, ఎటిజిఎల్ రూ.1467.35, ఎపిఎల్ సూచీ రూ.133.90కు పడిపోయాయి. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ (ఎపిఎస్ఇజడ్) ఇంట్రాడేలో ఓ దశలో రూ.802కు పెరిగినప్పటికీ అనంతరం రూ.755 కనిష్టానికి చేరుజే..తుదకు 1.5 శాతం నష్టంతో రూ.757.20 వద్ద ముగిసింది.అదానీ గ్రూపు కంపెనీల్లో మూడు డొల్ల కంపెనీలతో రూ.43,500 కోట్ల హవాలా పెట్టుబడులు వచ్చి చేరాయని.. దీంతో ఆ మూడు కంపెనీల ఖాతాలను ఎన్ఎస్‌డిఎల్ స్తంభింపజేసిందన్న వార్తలను అదానీ గ్రూపు కొట్టిపారేసినప్పటికీ.. ఆధారాలు చూపించలేకపోయింది. స్టాక్ ఎక్స్చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ఇప్పటికీ స్పందించకపోవడం మదుపర్లలో మరిన్ని అనుమానాలను పెంచింది. ఈ దెబ్బతో రెండో రోజూ సూచీలకు నష్టాలు తప్పలేదు. మారిషస్ కేంద్రంగా ఒకే అడ్రస్‌తో పని చేస్తోన్న ఆ మూడు అనుమానిత కంపెనీల డాక్యుమెంట్లు, నో యువర్ క్లయింట్ (కెవైసి) వివరాలను అదానీ గ్రూపు బయటపెట్టలేకపోయింది. దీంతో అదానీ గ్రూపులో హవాలా పెట్టుబడుల్లో వాస్తవం ఉండి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు.యూరప్, నార్త్ అమెరికా, ఆస్ట్రేలియాలలో కంటే ఎక్కువ జనాభా ఉన్న దేశం సంక్షోభాన్ని ఎంత బాగా హ్యాండిల్ చేసిందో గుర్తించాలి' అని జేపీమోర్గాన్ ఇండియా ఇన్వెస్టర్ సమ్మిట్‌లో గౌతమ్ అదానీ పేర్కొన్నారు. తాజాగా అదానీ గ్రూప్ మీడియా బిజినెస్‌లోకి ఎంటర్ అవుతుందనే వార్తలొస్తున్నాయి. ఈ టైమ్‌లో ఆయన మీడియాను విమర్శించడం విశేషం. తాజాగా సీనియర్ జర్నలిస్ట్ సంజయ్ పుగాలియాను అదానీ గ్రూప్ నియమించుకుంది. సంజయ్ గతంలో బీబీసీ రేడియో, నవ్‌భారత్ టైమ్స్, జీ న్యూస్, స్టార్ న్యూస్, సీఎన్‌బీసీ, క్వింట్ వంటి సంస్థల్లో సీఈఓగా, చీఫ్ ఎడిటర్‌గా పనిచేశారు.

# కొత్తపల్లి సుబ్బరాయుడు దారెటు

ఏలూరు, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)ఆయన సమైక్య రాజకీయాల్లోనే ఓ సీనియర్ నేత. సమైక్య రాష్ట్రంలోనే మాజీ మంత్రిగా చక్రం తిప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పలు కీలక పదవులు చేపట్టారు. జిల్లాలో మహామహులు ఉన్నా కూడా ఆయన చెప్పిందే వేదంగా నడిచేది. అలాంటి నేత రాజకీయంగా వేసిన రాంగ్ స్టెప్పులతో ఇప్పుడు వైసీపీలో పూచిక పుల్ల మాదిరిగా మారిపోయారు. రాష్ట్రం, జిల్లా సంగతి దేవుడు ఎరుగు.. చివరకు తన సొంత నియోజకవర్గంలో ఓ కౌన్సెలర్ టిక్కెట్ ఇప్పించుకోలేని దీనస్థితికి దిగజారిపోయారు. ఆ నేత ఎవరో కాదు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం కేంద్రంగా రాజకీయాలు ప్రారంభించిన కొత్తపల్లి సుబ్బారాయుడు ప్రభుత్వ వ్యతిరేక గాలులను సైతం తట్టుకుని ఎన్నోసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన నరసాపురం ఎంపీగా గెలిచి.. తన సోదరుడు జానకీరామ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారు.తర్వాత జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. 2004లో పార్టీ చిత్తుగా ఓడినా కొత్తపల్లి సుబ్బారాయుడు గెలిచారు. 2009లో ప్రజారాజ్యంలోకి జంప్ చేసి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. ప్రస్తుత నరసాపురం ఎమ్మెల్యే ప్రసాదరాజు కొత్తపల్లి సుబ్బారాయుడుని చిత్తుగా ఓడించారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఆయన 2012 ఉప ఎన్నికల్లో మళ్లీ గెలిచి సంచలనం క్రియేట్ చేశారు. షరా మామూలుగానే 2014 ఎన్నికలకు ముందు వైసీపీలోకి వెళ్లి ఆ పార్టీ నుంచి పోటీ చేసి మళ్లీ ఓడారు. ఆ తర్వాత వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఇలా టీడీపీ ? ప్రజారాజ్యం ? కాంగ్రెస్ ? వైసీపీ ? టీడీపీ ఇప్పుడు మళ్లీ వైసీపీ ఇలా ఎన్నో పార్టీలు మారడం వల్ల ఆయన రాజకీయ ప్రభ మసకబారి ఆయన అవుట్ డేటెడ్ లీడర్ అయిపోయారు2014లో ఓడిన కొత్తపల్లి సుబ్బారాయుడు టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలోకి వచ్చి ఏపీ కాపు కార్పోరేషన్ ఛైర్మన్ అయ్యారు. ఇక గత ఎన్నికలకు ముందు చంద్రబాబు సీటు ఇవ్వలేదని మళ్లీ వైసీపీలోకి వెళ్లారు. పార్టీ మారిన సమయంలో జగన్ ఆయనకు ఎమ్మెల్సీ హామీ ఇచ్చారట. ఇప్పుడు వైసీపీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. ఎమ్మెల్సీ కాదు కదా.. కనీసం జిల్లా స్థాయి నామినేటెడ్ పదవి కూడా కొత్తపల్లి సుబ్బారాయుడికి ఇవ్వలేదు. అన్నింటికన్నా ఘోర అవమానాలే ఆయనకు మిగులుతున్నాయి.ప్రస్తుతం నరసాపురంలో ఎమ్మెల్యే ప్రసాదరాజు పెత్తనం నడుస్తోంది. చివరకు తన వర్గానికి ఓ కౌన్సెలర్ పదవి ఇప్పించుకునేందుకు కూడా కొత్తపల్లి సుబ్బారాయుడు అష్టకష్టాలు పడుతున్నారు. ఇక ఇటీవల నామినేటెడ్ పదవుల భర్తీ జరిగినప్పుడు కూడా కొత్తపల్లి సుబ్బారాయుడుని అసలు ప్రాపబుల్స్‌లోకే తీసుకోలేదట. ఇప్పుడు మున్సిపల్ కౌన్సెల్లో కొత్తపల్లి సుబ్బారాయుడు వర్గంగా ఉన్న వారికి ఒక్క పదవి కూడా ఇవ్వ లేదు. ప్రసాదరాజు అన్ని పదవులు తన వర్గానికే ఇప్పించుకుంటున్నారు. నియోజకవర్గంలో కొత్తపల్లి సుబ్బారాయుడు వర్గంగా ఉన్న నేతలకు కనీసం గ్రామస్థాయిలో కూడా పనులు కావడం లేదు.ఇక వైసీపీ కేడర్ కూడా కొత్తపల్లి సుబ్బారాయుడుని నమ్మి ఆయన వెంట ఉంటే ఎప్పుడు పార్టీ మారతారో ? చెప్పలేం అని ఆయనకు దూరమై ఎమ్మెల్యే వెంట నడుస్తున్నారు. పైగా త్వరలోనే ప్రసాదరాజు మంత్రి అవుతారని..కొత్తపల్లి సుబ్బారాయుడు వెంట ఉంటే ఉపయోగం ఉండదని స్థానిక వైసీపీ కేడర్ చెవులు కొరుక్కుంటోంది. ఏదేమైనా పూలు అమ్మినచోటే కట్టెలమ్మే స్థితికి కొత్తపల్లి సుబ్బారాయుడు రాజకీయం వచ్చేసింది.

# జలాశయాలకు పోటెత్తిన వరద



విజయవాడ, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు నదులు పోటెత్తాయి. రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార నదుల్లోకి వరదనీరు భారీ ఎత్తున వస్తుండటంతో ఆయా నదులపై ఉన్న రిజర్వాయర్లన్నీ నిండుకుండల్లా వరదనీటితో తొణికిసలాడుతున్నాయి. నెల్లూరు జిల్లాలోని కండలేరు రిజర్వాయరు మినహా మిగిలిన రిజర్వాయర్లు పూర్తిస్థాయి నీటి నిల్వలతో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే కృష్ణా, గోదావరి, వంశధార నదుల నుంచి 3000 టిఎంసిలకు పైగా వరదనీరు సముద్రం పాలైంది. కృష్ణా నది ఉగ్రరూపం దాల్చింది. శ్రీశైలం డ్యామ్‌లోకి 2 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా... దిగువకు నాగార్జునసాగర్ వైపు దాదాపు 3.5 లక్షల క్యూసెక్కులను అధికారులు వదులుతున్నారు. నాగార్జున సాగర్ రిజర్వాయరులోకి 3.14 లక్షల క్యూసెక్కులు వస్తుండగా... దిగువన పులిచింతల ప్రాజెక్టులోకి 3.21 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టులోకి 3.18 లక్షల క్యూసెక్కులు వస్తుండగా... ప్రకాశం బ్యారేజీ వైపు 3.23 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రకాశం బ్యారేజీలోకి 4.43 లక్షల క్యూసెక్కులు వస్తుండగా... పంటకాలువల్లోకి 4,328 క్యూసెక్కులను వదిలి 4 లక్షల 44 వేల 640 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దాదాపు నాలుగున్నర లక్షల క్యూసెక్కులను వదలడంతో దిగువన విజయవాడతోపాటు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గతేడాది కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ నుంచి 798 టిఎంసిల నీరు సముద్రం పాలుకాగా, ఈ ఏడాది ఆదివారం నాటికే 339 టిఎంసిలు సముద్రం పాలయ్యాయి. గోదావరి నదిలో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గతేడాది 3,797 టిఎంసిల నీరు సముద్రంపాలు కాగా... ఈ ఏడాది ఇప్పటికే 2,631 టిఎంసిలు సముద్రంలో కలిసిపోయాయి. వంశధార నుంచి గతేడాది 134 టిఎంసిలు సముద్రంలో కలవగా... ఈ ఏడాది ఇప్పటికే 31 టిఎంసిలు వృథాగా సముద్రంలోకి కలిసిపోయాయి. ఈ ఏడాది కృష్ణా, గోదావరి, వంశధార నుంచి 3000 టిఎంసిల నీరు ఇప్పటికే వృథాగా సముద్రంలో కలిసిపోయాయి.పెన్నా నదిపై ఉన్న సోమశిల రిజర్వాయరు పూర్తిస్థాయి నీటి నిల్వ అయిన 78 టిఎంసిలతో కళకళలాడుతుండగా, సోమశిలకు దిగువన ఉన్న కండలేరు రిజర్వాయరు 68 టిఎంసిల పూర్తిస్థాయి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 39 టిఎంసిలతో మాత్రమే ఉంది. పెన్నా నదిలో వరద ప్రవాహం లక్ష క్యూసెక్కులకు పైగా ఉండటంతో కండలేరు రిజర్వాయరు కూడా రెండుమూడు రోజుల్లో పూర్తిస్థాయి నీటి నిల్వలకు చేరుకునే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో సాగునీటిని అందించే అన్ని రిజర్వాయర్లు సామర్థ్యం 960 టిఎంసిలు కాగా ప్రస్తుతం 882 టిఎంసిల నీరు రిజర్వాయర్లలో ఉంది.

# ధరలు పెంచేసి చుక్కలు చూపిస్తున్నవ్యాపారులు



కడప సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)పంటలకు ఎరువుల వినియోగం పెరిగిన నేపథ్యంలో వ్యాపారులు ధరలు పెంచేసి చుక్కలు చూపిస్తున్నారు. వరి, పసుపు, చెరుకు, కూరగాయలు ఇతర పంట ఎదుగుదలలో కీలకపాత్ర పోషించే యూరియాను బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధిక వర్షాలకు పత్తి మొక్కలను ఉరక దెబ్బ నుంచి రక్షించుకునేందుకు వ్యవసాయ శాఖ సూచన మేరకు ఎకరాకు 15 కిలోలు పొటాష్, 25 కిలోల యూరియా సిఫారసు చేస్తున్నారు. రైతు లెక్కల్లో పరిశీలిస్తే ఇంతకంటే అధికంగానే వినియోగం ఉంటుంది. జిల్లాలో కుందూ, పెన్నా, కెసి, మైలవరం, గండికోట ప్రాంతాలలో వరి సాగు ఊపందుకుంది. మైదుకూరు, దువ్వూరు మండల పరిధిలో కూరగాయల పంటలు సాగులో ఉన్నాయి. టమోట, మిరప పంట వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. దుక్కిలో ఎరువులు వేస్తున్నారు. మున్ముందు వీటి వినియోగం అధికం కానుంది. పంట ఏదైనా తొలి దశలో ఎరువులు అందించాల్సిన అవసరం ఉంటుంది. డిఎపి, కాంప్లెక్స్, పొటాష్, ఫాస్ఫేట్ వంటి ఎరువుల్లో యూరియా కలిపి వాడుతుంటారు. ఇక వేరుపురుగు, కలుపు నివారణ మందుల్లో కలుపుతున్నారు. రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. గరిష్ఠ అమ్మకం ధరకు మించి విక్రయిస్తున్నారు. 45 కిలోల బస్తాకు రూ.80 అధికంగా పిండుతున్నారు. అవసరం లేని ఇతర ఎరువులు, పురుగు మందులు కొంటేనే అడిగినన్ని యూరియా బస్తాలు ఇస్తామంటూ షరతు పెడుతున్నారు. కంపెనీ విక్రయ కేంద్రాల్లో ఈ పద్ధతి ఉంది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సొసైటీ సంఘాల్లో అరకొరగానే ఎరువులను విక్రయిస్తున్నారు. వీటిల్లో మాత్రం గరిష్ఠ చిల్లర ధరలకే ఇస్తున్నారు. అన్నీ సొసైటీల్లో అందుబాటులో లేక దుకాణాల్లోనే అధిక శాతం కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు రైతు భరోసా కేంద్రాల్లో కోరిన వెంటనే ఎరువులు దొరకడం లేదు. రైతులు వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది.యూరియా తయారీ సంస్థల నుంచి గూడ్స్‌లో వచ్చిన నిల్వలను డీలరుకి ఇన్‌వాయిస్ రేట్లకంటే యూరియాను అధిక ధరకు విక్రయించడంతో ఈ సమస్య తలెత్తిందని వ్యవసాయ శాఖ అధికారులే కొంత మంది బహిరంగ ప్రచారం చేస్తుండటం గమనార్హం. ఉన్నత స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు అధికారులకు మా మూళ్లు అందుతుండటంతో చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దస్త్రాల్లో నమోదు చేయకుండా గిడ్డంగుల్లోనే అనదికారికంగా యూరియా బస్తాలు నిల్వ చేస్తున్నారు. సరఫరా దారుడు(ఓఫాం) పత్రాలు ఇవ్వకపోవడంతో అమ్మకాలు నిలిపి వేస్తున్నామని బయటకు చెబుతున్నప్పటికీ వాస్తవాలు వేరుగా ఉంటున్నాయి. సకాలంలో యూరియా వేయకపోతే దిగుబడులు తగ్గిపోతాయని ఆందోళన ఖరీఫ్ సాగు అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో పలు మండలాల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఖరీఫ్ సీజన్ ముగిసే నాటికి జిల్లాకు 21వేల టన్నుల వరకు యూరియా సరఫరా అయ్యేది. అయితే ప్రస్తుతం జిల్లాకు డీలర్లు, సహకార సంఘాలు, మార్క్ఫెడ్, రైతు భరోసాల ద్వారా గత వారానికి 9679 టన్నుల మాత్రమే వచ్చినట్లు తెలుస్తున్నది. ఎరువుల కంపెనీల నుంచి ప్రైవేటు దుకాణాలకు స్టాకు రావడం లేదు. అయితే సాగు చేస్తున్న పంట విస్తీర్ణం బట్టి కాకుండా ప్రతి రైతుకు ఒకటి, రెండు (45 కిలోలు) మాత్రమే ఇస్తుండడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యూరియా కొరత లేదని వ్యవసాయాధికారులు చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన లేదని పలువురు రైతులు అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఇంతవరకు దాదాపు 70 శాతం విస్తీర్ణంలో వరి నాట్లు పూర్తయినట్టు అధికారుల సమాచారం. ఈ తరుణంలో వరి, చెరకుతో పాటు ఉద్యాన పంటలకు యూరియా అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది జిల్లాకు తగినంత యూరియా సరఫరా కాలేదు. కరోనా వైరస్..లాక్‌డౌన్ కారణంగా కంపెనీల్లో ఏప్రిల్ నుంచి చాలా కాలంపాటు ఎరువులు ఉత్పత్తి నిలిచిపోయింది. ఆ ప్రభావం ఖరీఫ్ అవసరాలపై పడింది. ప్రైవేటు ఎరువుల దుకాణాలకు యూరియా సరఫరా దాదాపు నిలిచిపోయింది. కేవలం సహకార సంఘాలకు మాత్రమే పరిమితంగా స్టాకు వస్తోంది. అవసరాలకు సరిపడా ఎరు వులు రాకపోవడంతో ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారు. అది కూడా అందరికీ అందడం లేదు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల సరఫరా చేసే అవకాశం ఉన్నప్పటికీ, ముందుగా డబ్బులు కడితే తప్ప ఎరువులు వచ్చే పరిస్థితి లేదు. గ్రోమోర్ కేంద్రాలలో కూడా ఈసారి యూరియా లభించడం లేదు. గత వారంలో జిల్లాలో యూరియా కొరత వాస్తవ పరిస్థితులు గుర్తించేందుకు కమిషనరేట్ నుంచి కమిటి పలు మండలాలలో తనిఖీలు నిర్వహించారు.

## చంద్రగిరి నుంచి గల్లా ఫ్యామిలీకి ఛాన్స్

తిరుపతి, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)సొంత ఇలాకాలో పార్టీ దెబ్బతింటే ఆ ఎఫెక్ట్ అన్ని ప్రాంతాలపై పడుతుంది. చంద్రబాబు సొంత నియోజకవర్గం ఏది అంటే కుప్పం అని అందరూ చెబుతారు. కానీ చంద్రబాబు ఎమ్మెల్యేగా ఎన్నికయింది తొలుత చంద్రగిరి నుంచే. 1978లో చంద్రబాబు చంద్రగిరి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆయన కుప్పం నియోజకవర్గానికి షిఫ్ట్ అయ్యారు. చంద్రగిరి లో చివరి సారి తెలుగుదేశం పార్టీ గెలిచింది 1994లోనే. 1994లో చంద్రగిరి నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన నారా రామ్మూర్తి నాయుడు విజయం సాధించారు. ఆ తర్వాత ఇక్కడ పసుపు జెండా ఎగరలేదు. అంటే టీడీపీ చంద్రగిరిలో గెలిచి మూడు దశాబ్దాలవుతుంది. చంద్రగిరిలో ఎన్ని ప్రయోగాలు చేసినా ఫలితం అనుకూలంగా రాలేదు. సొంత నియోజకవర్గంగా చంద్రబాబు దీనిని భావిస్తారు. ఇక్కడ వరసగా రెండుసార్లు నుంచి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గెలుపొందారు. హ్యాట్రిక్ విజయం కోసం ఆయన కష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో మొన్నటి ఎన్నికల్లో చంద్రగిరి నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన పులివర్తి నానిని పక్కన పెట్టాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. మరోసారి చెవిరెడ్డికి ఛాన్స్ ఇవ్వకూడదని గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకోసమే చంద్రగిరిలో తిరిగి గల్లా అరుణకుమారిని వచ్చే ఎన్నికల్లో పోటీ చేయించాలని నిర్ణయించారట.

# శివప్రసాద్ కుటుంబానికి పదవి

ఒంగోలు, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)ఏదైనా అదృష్టం కలసి రావాలి. రాజకీయాల్లోకి వచ్చి లబ్ది పొందిన వారు కొందరైతే. పూర్తిగా నష్టపోయిన వారు మరికొందరు. అలా నష్టపోయిన వారిలో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఒకరు. ప్రకాశం జల్లాకు చెందిన ఈ యువనేత ఆర్థికంగా నష్టపోయి జగన్ ప్రభంజనంలోనూ గెలుస్తామన్న ధీమా ఉన్నా, డబ్బులు లేక పోటీ చేయలేకపోయారు. ఇప్పుడు జడ్పీ ఛైర్మన్ గా ఆయన తల్లి వెంకాయమ్మ పేరును జగన్ ఖరారు చేశారు. బూచేపల్లి శివప్రసాద్ తండ్రి సుబ్బారెడ్డికి దర్శి నియోజకవర్గంలో మంచి పేరుంది. ఆయన 2004లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించి వైఎస్ కు సన్నిహితుడిగా మారారు. 2009 ఎన్నికల్లో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పోటీ చేసి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన తర్వాత జగన్ పార్టీలో చేరిపోయారు. అయితే 2014 ఎన్నికల్లో దర్శి నుంచి పోటీ చేసిన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆర్థికంగా నష్టపోయారు.దీంతో జగన్ 2019 ఎన్నికలలో టిక్కెట్ ఇస్తానని చెప్పినా ఆర్థిక కారణాలతో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పోటీకి దూరంగా ఉన్నారు. దీంతో జగన్ మద్దిశెట్టి వేణుగోపాల్ కు టిక్కెట్ ఇవ్వడంతో ఆయన గెలిచారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆయన పదవుల కోసం ప్రయత్నిస్తున్నారు. తండ్రి మరణంతో కుటుంబ సమస్యలు కూడా తలెత్తాయి. దీంతో ఆర్థికంగా చితికిపోయారు. తమ కుటుంబానికి ఏదో ఒక పదవి ఇవ్వాలని బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఎప్పటి నుంచో జగన్ ను కోరుతున్నారు.ప్రస్తుతం ప్రకాశం జడ్పీ ఛైర్మన్ పేరును బూచేపల్లి వెంకాయమ్మ పేరును ఖరారు చేశారు. బూచేపల్లి వెంకాయమ్మ దర్శి నియోజకవర్గం నుంచి జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా పార్టీ కోసం పనిచేసిన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కుటుంబానికి జగన్ న్యాయం చేశారంటున్నారు పార్టీ క్యాడర్. మొత్తం మీద చాలా రోజుల తర్వాత బూచేపల్లి కుటుంబానికి పదవి దక్కనుండటంతో వారి అనచరులు సంబరాలు చేసుకుంటున్నారు.

# బీజేపీతో సయోధ్య సాధ్యమేనా

విజయవాడ, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ, టీడీపీ శత్రువులుగానే ఉన్నాయి. చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం ప్రయత్నిస్తున్నా కొందరు నేతలు దానికి అడ్డంకిగా మారారు. మోదీకి, చంద్రబాబుకు మధ్య గ్యాప్ పెరగడంతో ఈసారి కూడా ఇద్దరి మధ్య పొత్తు అసాధ్యమని రాజకీయ విశ్లేషకులు సయితం అంచనా వేస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో చంద్రబాబు బీజేపీతో సయోధ్య కోసం చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలించడం లేదు.అయితే ఈ నేపథ్యంలో వైసీపీ నేతలే ఇద్దరి మధ్య పొత్తు కుదిరేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. వైసీపీ నేతలు ఇలాగే వ్యవహరిస్తే బీజేపీ నేతలే చంద్రబాబుతో స్నేహం కోసం ముందుకు వచ్చే ఛాన్స్ లు ఉన్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఇటీవల ఏపీ ముఖ్యమంత్రి జగన్ కు లేఖ రాశారు. మాంసం, చేపల విక్రయాలు ప్రభుత్వం చేపట్టాలన్న నిర్ణయంపై అభ్యంతరం తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సోము వీర్రాజు డిమాండ్ చేశారు.కానీ మంత్రి సీదిరి అప్పలరాజు మాత్రం సోము వీర్రాజు లేఖకు కొత్త భాష?యం చెప్పారు. ఆ లేఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తయారైందని వ్యాఖ్యానించారు. చంద్రబాబు చెప్పినట్లే సోము వీర్రాజు నడుచుకుంటున్నారని విమర్శించారు. జగన్ కు లేఖ రాసే బదులు ప్రత్యేక హోదా కోసం సోము వీర్రాజు ప్రధాని మోదీకి లేఖ రాయడం మంచిదని మంత్రి సూచించారు. ఈ వ్యాఖ్యలు తెలుగుదేశం పార్టీలో ఆనందం నింపాయి.రాష్ట్రంలో బీజేపీ తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉన్నప్పుడే కాస్తో, కూస్తో సీట్లు గెలుచుకుంది. టీడీపీ వల్ల బీజేపీ ఏపీలో ఎదగలేదని సోము వీర్రాజు వంటి నేతలు ఇప్పటి వరకూ అధినాయకత్వానికి చెప్పుకుంటూ వస్తున్నారు. కానీ వైసీపీ నేతల కామెంట్స్ ఇద్దరూ మరోసారి కలసి పోటీ చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. మొత్తం మీద చంద్రబాబు పెద్దగా శ్రమ లేకుండానే ఆయన అనుకున్న పనిని వైసీపీ నేతలు పూర్తి చేస్తున్నారు

# ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ

రాజమండ్రి, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)ఇన్నాళ్లూ గుంభనంగా ఉన్నారు. ఇప్పుడు నేరుగా రోడ్డెక్కేశారు. అధికారపార్టీలో చర్చగా మారారు అక్కడి ఎంపీ, ఎమ్మెల్యేలు. వర్గపోరు మళ్లీ రాజుకుని.. సొంత పార్టీలోనే వైరిపక్షాలుగా మాటల తూటాలు పేల్చుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్.. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాల మధ్య విభేదాలు మరోసారి చర్చగా మారాయి. ఇటీవల రాజానగరం నియోజకవర్గంలో ఓ ఘటన యువనేతల మధ్య ఉన్న ఆధిపత్య పోరును మళ్లీ రాజేసింది. ఈ గొడవలో ఎంపీ భరత్ నేరుగా జోక్యం చేసుకుని సొంతపార్టీకి చెందిన వారిపై సీరియస్ కామెంట్స్ చేశారు. వాటికి ఎమ్మెల్యే రాజా కౌంటర్ ఇవ్వటంతో వాతావరణం వేడెక్కింది. దాంతో ఈ వర్గపోరు ఎలాంటి మలుపు తీసుకుంటుందో అన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది.పోటీచేసిన తొలి ప్రయత్నంలోనే ఎంపీగా భరత్.. ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాలు 2019 ఎన్నికల్లో ఒకేసారి విజయాలు అందుకున్నారు. రాజమండ్రి సిటీపై పెత్తనం విషయంలో ఈ ఇద్దరి మధ్యా విభేదాలు ఉన్నాయి. అయితే అవి అంతర్గతంగానే ఉండేవి. ఎవరి వర్గం వారిదే. గత రెండేళ్ల కాలంలో ఈస్థాయిలో విభేదాలు ఎప్పుడూ రచ్చకెక్కలేదు. ఇప్పుడు విభేదాలకు రాజానగరం వేదికైంది. తీవ్ర దుమారం రేపిన లెక్చరర్‌పై దాడి ఘటనలో ఎంపీ భరత్ సీరియస్ అయ్యారు. ఎమ్మెల్యే రాజా లక్ష్యంగా సొంతపార్టీ నేతలపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు. దీనిపై ఎమ్మెల్యే జక్కంపూడి స్పందించడంతో ఇన్నాళ్లూ గుంభనంగా ఉన్న వీరి ఆధిపత్యపోరు బహిరంగమైంది. ఎంపీ, ఎమ్మెల్యేలే ఒకరిపైఒకరు దూషించుకునే స్థాయికి చేరుకుంది. ఎంపీ భరత్‌పై ఎమ్మెల్యే రాజా చేసిన కామెంట్స్ డోస్ కాస్త గట్టిగానే ఉంది. టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి రాజమండ్రిలో వైసీపీని ఎంపీ భరత్ నాశనం చేస్తున్నారని ఆరోపించారు రాజా. రౌడీషీటర్లు, భుకబ్జాదారులను వెనకేసుకొస్తున్నారని మండిపడ్డారు. ఇలా సొంతపార్టీకే చెందిన ఎంపీపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో హీట్ పెంచుతున్నాయి.ప్రస్తుతం రాజమండ్రిలో వార్డుల వారీగా రాజన్న రచ్చబండ కార్యక్రమాన్ని భరత్ చేపడుతున్నారు. త్వరలో రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు వైసీపీకి కీలకం కానున్నాయి. పట్టు సాధించేందుకు ఎంపీ, ఎమ్మెల్యే వర్గాలు చూస్తున్నాయి. అయితే తాజా గొడవలు చూశాక మేయర్ పీఠంపై వైసీపీ గురితప్పుతుందా అన్న ఆందోళన పార్టీ వర్గాల్లో ఉందట. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల వైసీపీ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి తలనొప్పిగా మారినట్టు సమాచారం. ఇటీవలే రెండుసార్లు రాజమండ్రి వచ్చిన వైవీకి గతంలో ఎన్నడూ లేని విధంగా స్వాగతం అందుకున్నారు. భరత్, రాజా ఇద్దరూ సయోధ్యకు వచ్చినట్టు భావించారు. కానీ.. తాజా మాటల తూటాలు చూశాక.. ఇద్దరి మధ్య లోలోపల అగ్గి అలాగే ఉందని అర్థమైంది. ఈ వ్యవహారం ఎక్కడి వరకు వెళ్తుంది. ఎవరికి ఇబ్బంది తెచ్చిపెడుతుంది అన్నది చర్చగా ఉంది. మరి.. రాజమండ్రి వైసీపీలో ఎలాంటి పరిణామాలు జరుగుతాయో చూడాలి.

# వన్ మ్యాన్ ఆర్మీగా జగన్



విజయవాడ, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)రాజకీయ పార్టీ అన్న తర్వాత అసంతృప్తులు సహజం. ఎన్ని పదవులు ఇచ్చినా ఏదో ఒక కారణం వారిలో అసంతృప్తిని రగిలిస్తుంది. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎంతమందికో పదవులను ఇచ్చారు. కొందరు ఊహించని విధంగా మంత్రులయ్యారు. మరికొందరిని పిలిచి మరీ ఎమ్మెల్సీలను చేశారు. అయినా వైసీపీ నేతల్లో అసంతృప్తి కనిపిస్తూనే ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారంపై పెదవి విప్పేందుకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు.జగన్ వన్ మ్యాన్ ఆర్మీ. ఆయన వల్లనే వైసీపీ అఖండ విజయం సాధించిందనడంలో సందేహం లేదు. అయితే ఎప్పుడైనా సమిష్టి కృషి ఉంటేనే మరోసారి గెలుపు దక్కుతుంది. జగన్ ఏ పనిచేసినా అది విపక్షాలకు గిట్టదు. దానికి చిలవలు, పలవలు చేర్చి విమర్శలకు దిగుతుంటారు. దిశ చట్టం కావచ్చు. మటన్ మార్ట్ లు, ఇసుక విధానం వంటి నిర్ణయాలపై విపక్షాలు నిత్యం దండెత్తుతున్నాయి.కానీ ప్రభుత్వం నుంచి సరైన వాయిస్ విన్పించడం లేదు. విపక్షాలకు ధీటుగా సమాధానం చెప్పేందుకు నేతలు ఎవరూ ముందుకు రావడం లేదు. విపక్షంలో ఉన్నపుడు గళమెత్తిన అంబటి రాంబాబు, రోజా వంటి నేతలు సయితం సైలెంట్ అయ్యారు. దీనికి ప్రధాన కారణం వారిలో అసంతృప్తి అని చెబుతున్నారు. జగన్ తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి బయటకు రావడం లేదు. మీడియా సమావేశాల్లోనూ కూడా పాల్గొనడం లేదు. ఈ నేపథ్యంలో జగన్ ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను ఖండించాల్సిన పార్టీ నేతలు మౌనంగా ఉండటం దేనికి సంకేతం? మంత్రి వర్గ విస్తరణ ఉండటంతో తమ పదవి అయిపోయిందని కొందరు మంత్రులు మౌనంగా ఉంటున్నారు. ఇక ఎమ్మెల్సీ పదవులు పొందిన వారు సయితం వివాదాల జోలికి పోకుండా కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఇలాగే ఉంటే విపక్షాల విమర్శలు జనంలోకి బలంగా వెళ్లి పార్టీ బలహీనం కాక తప్పదు. పదవులు పొంది కాలక్షేపం చేస్తున్న వారిని జగన్ ఇకనైనా పక్కన పెట్టాలని పలువురు నేతలు సూచిస్తున్నారు. డిసెంబర్ నుంచి జనాల్లోకి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ డిసెంబరు నెల నుంచి క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లనున్నారు ఈ మేరకు జగన్ సంకేతాలు ఇచ్చారు. స్పందన వీడియో కాన్ఫరెన్స్ లో ఈ విషయాన్ని జగన్ వెల్లడించారు. వచ్చే నెల నుంచి ఎమ్మెల్యేలు వారానికి నాలుగు గ్రామ సచివాలయాలను సందర్శించాలని జగన్ ఆదేశించారు. విలేజ్ వార్డు సచివాలయాలను తనిఖీ చేయాలన్నారు. ప్రతి నెల చివరి శుక్ర, శనివారాల్లో సిటిజన్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. డిసెంబరు నుంచి తాను కూడా గ్రామ సచివాలయాలను సందర్శించనున్నట్లు జగన్ తెలిపారు.

# కర్నూలులో గాడిద పెళ్లి

కర్నూలు, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)గ్రామీణ ప్రాంత ప్రజలు సాధారణంగానే మూఢ నమ్మకాలను ఎక్కువగా విశ్వసిస్తారు. దేవుళ్లకు బలి ఇవ్వడం, రకరకాల పూజలు చేస్తుంటారు. ఇక ముఖ్యంగా చెప్పుకోవాలంటే.. వర్షాల కోసం చాలా ప్రాంతాల్లో ప్రజలు రకరకాల ఆచారాలను పాటిస్తుంటారు. వింత వింత కార్యక్రమాలు చేపడుతుంటారు. వర్షాలు కురవడం కోసం యజ్ఞ యాగాలు చేస్తుంటారు. మరికొందరైతే.. తమ తమ సంప్రదాయం, తమకు తెలిసిన నమ్మకాల ప్రకారం కప్పలకు, జంతువులకు పెళ్లి చేయడం వంటి పూజలు నిర్వహిస్తుంటారు. తాజాగా కర్నూలు జిల్లాలోనూ ఓ వింత ఆచారం వెలుగు చూసింది. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ అక్కడి ప్రజలు గాడిదలకు ఘనంగా పెళ్లి చేశారు. ఈ ఘటన జిల్లాలోని పత్తికొండ మండలం.. హోసూరులో చోటు చేసుకుంది.వివరాల్లోకెళితే.. రాష్ట్ర వ్యాప్తంగా సకాలంలో వర్షాలు కురవాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ హోసూరు గ్రామ ప్రజలు వాసుదేవ కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా అత్యంత భక్తి శ్రద్ధలతో గాడిదలకు ఘనంగా పెళ్లి చేశారు. అనంతరం ఊరంతా ఊరేగింపు నిర్వహించారు. అక్కడి రైతులు.. హోసూరు ప్రాంతంలో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. తాగడానికి నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గాడిదలకు పెళ్లి చేస్తే వర్షాలు బాగా కురుస్తాయని గ్రామస్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలోనే.. అచ్చం మనుషులకు ఎలాగైతే పెళ్లి తంతు నిర్వహిస్తారో.. గాడిదలకు కూడా అలాగే నిర్వహించారు. అయితే, గతంలో కూడా గాడిదలకు పెళ్లి చేస్తే వర్షాలు విస్తారంగా కురిసాయని, అందుకే ఈ సంవత్సరం కూడా గాడిదలకు పెళ్లిళ్లు చేస్తున్నామని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా వర్షాలు కురిసి, పంటలు బాగా పండుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.కాగా, ఈ గాడిదల పెళ్లికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా అదికాస్తా వైరల్‌గా మారింది. ఈ పెళ్లి చూసి నెటిజన్లు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కోసం చేస్తున్న వీరి ప్రయత్నం వింతగా ఉందని కామెంట్స్ చేస్తున్నారు. కంప్యూటర్ యుగంలోనూ.. ఈ మూఢ నమ్మకాలు ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరికొందరు ఎవరి విశ్వాసాలు వారివి అంటూ గ్రామస్తుల చర్యను సమర్థిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ప్రమాణికులకు గాయాలు

నల్గొండ విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి లక్కారం సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్సును టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో 15 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడినవారిలో ట్రావెల్స్ బస్సు, టిప్పర్ డ్రైవర్ల పరిస్థితి విషమంగా ఉంది. మరోవైపు ఘటనాస్థలంలోనే మరో ప్రమాదం చోటుచేసుకుంది. అక్కడే ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. లారీ డ్రైవర్కు గాయాలు కావడంతో అతడిని ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది.

# 26న ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞత సభ

## బోస్, మోషేన్ రాజు, నామినేటెడ్ పదవులకు ఘన సత్కారం

## ఎంపీ మార్గాని భరత్ రామ్ వెల్లడి

రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 23బిసి, ఎస్సీ, ఎస్టి, మైనార్టీలకు చారిత్రాత్మక గుర్తింపు నిచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారికి కృతజ్ఞతా పూర్వకంగా రాజమహేంద్రవరంలో కృతజ్ఞతా సభ నిర్వహించనున్నామని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్ రామ్ తెలిపారు.రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్‌చంద్రబోస్‌కు, కొయ్యే మోషేన్ రాజుకు ఎమ్మెల్సీ పదవితో పాటు పలువురికి నామినేటెడ్ పదవులు ఇచ్చిన శుభసందర్భంగా ఈ నెల 26వ తేదీన నగరంలోని చెరుకూరి కళ్యాణమండపంలో కృతజ్ఞతపూర్వక సభను ఏర్పాటు చేస్తున్నామని, ఈ సభలో పిల్లి సుభాస్ చంద్రబోస్, కొయ్యే మోషేన్ రాజులకు ఘన సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ చీఫ్‌విప్ మార్గాని భరత్ రామ్ వెల్లడించారు. నగరంలోని మార్గాని ఎస్టేట్‌లోని ఎంపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతోపాటు, మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిడంతోపాటు, నామినేటెడ్ పోస్టులతోపాటు, నామినేషన్ పనుల కేటాయింపుల్లోనూ 50 శాతం రిజర్వేషన్ పాటిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిదేనని అన్నారు.ఈ విధమైన పాలన సాగిస్తూ దేశానికే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిలుస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల్లో ముఖ్యంగా చంద్రబాబు నాయుడు బీసీలను వాడుకుని వదిలేసి, వారిని అవహేళన చేశారని విమర్శించారు.అయితే బీసీలంటే పార్టీకి వెన్నుముఖగా భావించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీలకు సముచిత స్థానాన్ని కల్పిస్తున్నారని అన్నారు. రాజ్యసభ పదవుల విషయంలో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీసీలకు అర్ధభాగం కేటాయించి బీసీల పట్ల ఉన్న తన చిత్తశుద్ధిని ముఖ్యమంత్రి నిరూపించుకున్నారని తెలిపారు.బీసీ సామాజికవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న పిల్లి సుభాస్‌చంద్రబోస్‌కు, మత్స్యకార ప్రతినిధిగా మోపిదేవి వెంకటరమణకు రాజ్యసభ పదవులను ఇవ్వడంతోపాటు, విద్యార్థి దశ నుంచే తాను పనిచేసిన పార్టీ పట్ల ఎంతో అంకిత భావంతో సేవలు అందించిన రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ వైకాపా అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజుకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి గుర్తించారని అన్నారు. ఎస్సీ, బీసీ సామాజికవర్గాలకు తగిన గుర్తింపును ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియచేసేందుకు రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాలకు చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పిల్లి బోస్, కొయ్యే మోషేన్ రాజులను ఘనంగా సత్కరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ నెల 26వ తేదీ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నగరంలోని చెరుకూరి కళ్యాణ మండపంలో కృతజ్ఞతపూర్వక సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కృతజ్ఞతపూర్వక సభ ద్వారా ఎస్సీలు, బీసీలు ముఖ్యమంత్రి వెంటే ఉన్నారనే సంకేతాన్ని ఇచ్చేలా ఈ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.పార్టీలో ఉన్న విబేధాలను పార్టీ అధిష్టానం చూసుకుంటుందని, వందకు వంద శాతం పార్టీలో ఉన్నవారంతా తన వెంటే ఉండాలనే నిబంధన ఏమీ లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.పురుషోత్తపట్నం రైతుల వ్యవహారంపై అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ పురుషోత్తపట్నం రైతులను కడియం మండలంలో జరిగిన ఎన్నికల సమాయంలో ఒకసారి కలిశారని, పురుషోత్తపట్నం రైతుల వ్యవహారంపై అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ పురుషోత్తపట్నం రైతులను కడియం మండలంలో జరిగిన ఎన్నికల సమాయంలో ఒకసారి కలిశారని, అలాగే వైఎస్సార్ జయంతి ఉత్సవంలో పాల్గొనేందుకు సీతానగరం వెళ్లిన సందర్భంలో పురుషోత్తపట్నం రైతులు కలవడానికి వచ్చారని సమాచారం ఇచ్చారని వివరించారు. కడియం మండలంలో పొట్టిలంక గ్రామాన్ని తాను దత్తత తీసుకున్న మాట వాస్తమేనని, అయితే నా నియోజకవర్గానికి దూరంగా ఉన్న గ్రామాన్ని గతంలో ఎవ్వరూ అభివృద్ధి చేయలేదని గుర్తించి ఆ గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నా సంకల్పంతో దత్తత తీసుకున్నానని తెలిపారు. పొట్టిలంక గ్రామంలో జనసేన పార్టీ ప్రాభల్యం అధికంగా ఉంటుందని అందరికీ తెలుసునని, అయినా పోటీని ఇవ్వాలని తమ పార్టీ పక్షాన అభ్యర్థిని పోటీలో నిలిపామని, అయితే ఆ అభ్యర్థి సైతం జనసేనతో కలిసిపోవడంతో ఓటమి చెందామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అయితే సర్పంచ్ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థి ఎందుకు ఓడిపోయారో చెప్పాలని అన్నారు.

## ముదిరిన ఎంపీ, ఎమ్మెల్యేల వివాదం

రాజమండ్రి సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్) రాజమండ్రి ఎంపి మార్గాని భరత్ రాం, ఎమ్మెల్యే జక్కంపేడి రాజాల వివాదం ముదురుతోంది. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి భూములిచ్చిన రైతుల మీడియా సమావేశం జరిగింది. టిడిపి ప్రభుత్వంలో రైతులకు సరైన నష్టపరిహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారు. గతంలో మా పై కేసులు పెట్టిన సమయంలో జక్కంపూడు రాజా మాకు అండగా నిలబడ్డారు. 2013 భూసేకరణ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని మొదటి నుంచి కోరుతున్నామని రైతులు అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరోసారి ఎమ్మెల్యే రాజా మా తరపున సిఎం జగన్ కు సమస్య వివరించారు. ఇప్పుడు లెక్చరర్ దీపక్ కొంత మంది రైతులను మభ్యపెట్టి 50 లక్షల పరిహారం ఇప్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్తున్నాడు. ఆ సొమ్ములో 15 లక్షలు తనకు ఇవ్వాలని దీపక్ ఆ రైతులను అడిగారు.. దీని వెనుక ఎంపి భరత్ ఉన్నారని మా అనుమానమని రైతులు అంటున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సిఐడి ఇంక్వైరీకి ఆదేశించాలని డిమాండ్ చేసారు.

## భూ సర్వే విషయంలో ఘర్షణ

అనంతపురంసెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్) అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలం మంగళమడక గ్రామంలో భూ సర్వే విషయంలో ఒక కుటుంబంపై మరో వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు దాడికి యత్నించా రు. సున్నపురాళ్ల రంగమ్మ, రామప్ప దంపతులపై అదే గ్రామానికి చెందిన పోతుల రామ్మోహన్, మరి కొందరు వ్యక్తులు కొడవళ్ళతో దాడికి యత్నించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నందున తమ పొలంలో సర్వే నిర్వహించరాదని రంగమ్మ, రామప్ప దంపతులు అడ్డుకున్నారు. దీంతో రామ్మోహన్ తో పాటు మరికొందరు వ్యక్తులు కోపోద్రిక్తులై కులం పేరుతో దూషిస్తూ మీడియా ప్రతినిధులు, గ్రామస్తుల సమక్షంలోనే మారణాయుధాలతో మూకుమ్మడిగా సదరు దంపతులపై దాడికి యత్నించారు. దీంతో పొలం వద్ద ఉద్రిక్తత నెలకొంది. బాధితులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. డయల్ 100కి ఫోన్ చేసి బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆలస్యంగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఉన్న ఒక్క కానిస్టేబుల్ కూడా మద్యం సేవించి ఉండడంతో ఒక వర్గం మరో వర్గంపై దాడి చేస్తున్నా... అదుపు చేసే నాథుడే కరువయ్యాడు. తర్వాత ఇరువర్గాలను పోలీసు స్టేషన్ కు రావాలని ముదిగుబ్బ ఎస్ ఐ ఆదేశించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

## బిటి కాలేజీని అభివృద్ధి చేస్తాం

### ఎంపీ మిథున్ రెడ్డి

మదనపల్లె సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)మదనపల్లె బిటి కళాశాలను తప్పని సరిగా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని మరిన్ని కొత్త కోర్సులు తీసుకొచ్చి రాష్ట్రంలోనే ఒక మోడల్ కాలేజీగా మారుస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విద్యార్థులకు హామీ ఇచ్చారు. నేడు మదనపల్లె బిసెంట్ దివ్యజ్ఞాన కళాశాల విద్యార్థులు ప్రదర్శనగా ఎంపిడిఓ కార్యాలయం వద్దకు చేరుకుని ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీతో పాటు ఎమ్మెల్యే నవాజ్ భాషా ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాయలసీమకే తలమానికం అయిన బిటి కళాశాలను ప్రభుత్వపరం చేసే ప్రయత్నం జరుగుతోందని, విద్యార్థులు ఎవ్వరూ అధైర పడవద్దన్నారు. కళాశాల పేరు మార్పు చేయకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమించడం జరుగుతుందన్నారు. అదే విధంగానే మరిన్ని కోర్సులు తీసుకొచ్చి రాష్ట్రంలోనే ఒక మోడల్ కాలేజీగా మారుస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

### ఎంపీ మిథున్ రెడ్డి

మదనపల్లె సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)పడమటి మండలాల్లో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పేర్కొన్నారు. నేడు మదనపల్లె ఎంపిడిఓ కార్యాలయం నందు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నవాజ్ భాషా, జడ్పీటీసీ ఉదయ్ కుమార్, మున్సిపల్ ఛైర్ పర్సన్ వరపన మనూజ, కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ లీలామాధవి, మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శారదమ్మ, వైస్ చైర్మన్లు జింకా వెంకటాచలపతి, నూర్అజామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పథి చేస్తోందన్నారు. మదనపల్లె ప్రశాంత వాతావరణానికి పేరు గడించిందని ప్రతిపక్ష పార్టీల నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని సూచించారు. మదనపల్లె అభివృద్ధికి వారు సూచనలు, సలహాలు ఇస్తే స్వీకరిస్తామన్నారు. అంతే తప్ప వ్యక్తిగత దూషణలకు పాల్పడి ప్రశాంత వాతావరణాన్ని దెబ్బ తీయవద్దని హితవు పలికారు.

## వివాహిత మృతి?.బంధువుల ఆందోళన

విజయవాడ సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి న్యూ 'బి' కాలనీ లో వివాహిత మహిళ అనుమానస్పద రీతిలో మృతి చెందింది. మృతురాలు విజయలక్ష్మివి.టి.పి.ఎస్ .హాస్పిటల్ లో సీ.యల్ గా పనిచేస్తుంది. విజయలక్ష్మి మృతి చెందడంపట్ల ఆమె బంధువులు అందోళనకు దిగారు. భర్త సురేష్ చంపి ఆత్మహత్య గా చిత్రీకరించడని వారు అరోనించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్నివిజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. భర్త సురేష్ మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నడనే బంధువుల ఆరోపణ. గత కొద్ది కాలం గా భార్య, భర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. అందువల్లనే భార్యను హత్య చేసి ఆత్మహత్య గా చిత్రీకరించాడని బంధువులు ఆరోపించారు.

## కొండమ్మ కుటుంబాన్ని పరామర్శించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ

నెల్లూరు సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లా ఆత్మకూరు లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ గురువారం పర్యటించారు. ఆత్మకూరులో ఫ్యాన్ కు ఉరి వేసుకుని మృతి చెందిన కొండమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ ఆత్మకూరు లో జరిగిన కొండమ్మ ఘటన అందరిని తీవ్రంగా కలిచి వేసింది. ఆత్మహత్యకు ప్రేరేపిస్తూ భర్త చచ్చిపో చచ్చిపో అని రెచ్చగొట్టడం వల్లే కొండమ్మ ఆత్మహత్యకు పాల్పడింది. ఇన్ని రోజులు కాపురం చేసిన భార్య కళ్ళముందు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కాపాడకుండా వీడియో తీసి రాక్షసుడులా భర్త ప్రవర్తించాడు. ఉద్యోగం చేస్తూ తన కంటే ఉన్నత స్థాయిలో ఉందనే భావన, అనుమానం తోనే వేధించడంతో భార్య ఆత్మహత్యకు దారితీసి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. అనాథలైన ఇద్దరు పిల్లల బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. భర్తలు వేదిస్తూ ఉంటే మహిళలు ఆత్మహత్యలు చేసుకోవద్దు ప్రభుత్వం మహిళలకు అండగా ఉంటుంది. విచారించి చార్జిషీటు దాఖలు చేసేలా చూస్తామని, ఆత్మకూరు లో జరిగిన ఈ సంఘటన తనను వ్యక్తిగతంగా ఎంతో బాధించిందని కళ్ళముందే ఒక ప్రాణం పోతున్నా కనీసం కాపాడాలనే ఆలోచన లేకుండా రెచ్చగొట్టే మాటలతో ప్రవర్తించిన ఈ మానవ మృగానికి తగిన శిక్ష పడేలా చూస్తామని అన్నారు.

# విద్యుత్ పన్నుల భారం దారుణం

పెనమలూరు కరోనాతో ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రజలపై జగన్ ప్రభుత్వం అధిక విద్యుత్ పన్నుల భారం మోపడం దారుణంమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బాబూ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. గురువారం నాడు ఈ రోజు ఉయ్యూరు పట్టణం 15 వార్డులో ఉన్న కరెంట్ ఆఫీస్ దగ్గరకు పెద్దఎత్తున తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలసి పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిఈ కి మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నేను అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచను అని చెప్పి ఇప్పుడు రెండింతలు పెంచడం దారుణమని, అసలే కరోనాతో ఉపాధి లేక రాష్ట్ర ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతుంటే వైసీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు ఉంటూ ందని అన్నారు. పైగా కొత్తగా చెత్త పన్నులు వెయ్యడం , ఇంటి పన్నులు, మద్యం, పెట్రోల్ రేట్లు పెంచి ఇలా అనేక రకాలుగా ప్రజలపై ఏ విధంగా అధిక భారం వేద్దామా అని ఆలోచిస్తుందని అన్నారు. దీని వలన పేద మధ్య తరగతి ప్రజలు పస్తులుంటూ మీకు పన్నులు కట్టాల్సిన పరిస్థితి వస్తుందని, అరకొరగా పథకాల రూపంలో డబ్బులు ఇచ్చినట్లే ఇచ్చి దానికి రెండింతలు ప్రజల దగ్గరనుంచి వసూళు చెయ్యడం అంతా రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు వాళ్లే మీకు తగిన బుద్ధి చెబుతారని రాజేంద్ర ప్రసాద్అన్నారు. ఈ కార్యక్రమం లో పెనమలూరు మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఉయ్యూరు పట్టణ మరియు మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కర్నూలు వైసీపీలో ఇంటి పోరు



కర్నూలు, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)నెత్తి మీద గుడ్డ.. కళ తప్పిన ముఖం.. కంటి నిండా కన్నీరు.. ఈ సీన్ చూస్తే ఎవరికైనా వారి కుటుంబంలోనో లేదా బంధువుల్లోనో ఏదో అశుభం జరిగిందని అంతా భావిస్తాం.. ఇదే తరహాలో అయ్యో పాపం అని ఓదార్చేలా కనిపిస్తోన్నాయి ఇప్పుడు ఏపీలో సీన్స్. అయితే, దీని వెనక స్టోరీ వేరే ఉంది. వాళ్ల రోధనంతా అశుభం జరిగినందుకు కాదు.. తనకు పదవి కావాలని, అది కూడా మండల స్థాయిలో ఉండే ఏంపీపీ పదవి కోసం. కట్ చేస్తే..అఖండ మెజార్టీతో గెలిచిన వైసీపీ పార్టీ నేతలు పండగ చేసుకుంటున్నారు. అయితే కొందరు మాత్రం ఇలా రోదిస్తూ కనిపిస్తున్నారు. దానికి కారణం.. వారికి ఎంపీపీ పదవి కావాలని.. జిల్లా పరిషత్ చైర్మన్ విషయంలో అంతగా విభేదాలు కనిపించలేదు. కానీ ఎంపీపీ పదవి కోసం మాత్రం ఆశావహులు ఏడ్చే వరకు వెళ్లింది పరిస్థితి. ఇలాంటి సీన్ కర్నూలు జిల్లా కోడుమూరు నిమోజకవర్గంలో కనిపించింది.లోతుల్లోకి వెళ్తే, కోడుమూరు నియోజవర్గంలో ఎమ్మెల్యే సుధాకర్ సమన్వయకర్త కోట్ల హర్షవర్థన్ రెడ్డి మధ్య చాలా రోజులుగా విభేదాలు ఉన్నాయి. గూడూరు ఎంపీపీ పదవి తన తల్లికి వస్తుందని వైసీపీ నేత నరసింహారెడ్డి ఆశించారు. గూడూరు మండలంలోని కే నాగలాపురం నుంచి ఎంపీటీసీగా నరసింహారెడ్డి తల్లి రాజమ్మ గెలుపొందింది. ఇక గూడూరు ఎంపీపీ తల్లి రాజమ్మకు ఖాయం అనుకుంటున్న సమయంలో గత ఎన్నికల సందర్భంగా పార్టీలో చేరిన చనుగొండ్ల కు చెందిన ప్రతాప్ రెడ్డి తన భార్యకు ఎంపీపీ పదవి ఇప్పించుకునేందుకు చక్రం తిప్పారు.ఇంతకాలం కష్టపడితే పదవి వస్తుందనుకున్న సమయంలో వేరే వాళు ళ్ తన్నుకపోవడం పట్ల నరసింహారెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు. దుఃఖం పట్టలేక బోరున విలపించారు. తన తల్లి గ్రామ కార్యకర్తలతో కలిసి నాగలాపురం వైఎస్ఆర్ విగ్రహం దగ్గర ధర్నాకు దిగారు? కష్టపడిన కార్యకర్తలకు సీఎం జగన్ న్యాయం చేయాలని బోరున విలపించారు.

## కదులుతున్న డ్రగ్స్ డొంక

ముంబై, సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్) గుజరాత్‌లోని పోర్టులో భారీగా పట్టుబడిన డ్రగ్స్ కేసులో ఈడీ రంగంలోకి దిగింది. డ్రగ్స్ దందా వెనుక ఎవరున్నారు ? సూత్రధారులు ఎవరు ? పాత్రధారులు ఎవరు ? అనేది తేల్చే పనిలో పడింది. ఈనెల 13న గుజరాత్ ముంద్రా పోర్టులో రెండు కంటైనర్లలో డ్రగ్స్‌ని స్వాధీనం చేసుకున్నారు డీఆర్ఐ అధికారులు. 2,988 కేజీల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. అఫ్ఘనిస్తాన్ నుంచి ఇరాన్ మీదుగా భారత్‌కు డ్రగ్స్ తరలించినట్టు అధికారులు గుర్తించారు.టాల్క్‌స్టోన్స్, టాల్కం పౌడర్‌గా పేర్కొంటూ డ్రగ్స్‌ని భారత్‌కు రవాణా చేశారు. అయితే డీఆర్ఐ విచారణలో నార్కోటిక్ డ్రగ్ హెరాయిన్‌గా నిర్థారించారు. భారీ ఎత్తన డ్రగ్స్ పట్టుబడటంతో ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఆపరేషన్ చేపట్టింది డీఆర్ఐ. న్యూఢిల్లీ, నోయిడా, చెన్నై, కోయంబత్తూరు, అహ్మదాబాద్, మాండ్వి, గాంధీధామ్, విజయవాడ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఢిల్లీలో 16.1 కేజీల హెరాయిన్, నోయిడాలోని నివాస ప్రాంతాల్లో 10.2 కేజీల కొకైన్, 11 కేజీల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో నలుగురు అఫ్ఘనిస్తాన్ దేశస్తులు, ఒక ఉజ్బెకిస్తా?న్ దేశస్తుడితో పాటు మొత్తం 8 మందిని అరెస్ట్ చేశారు డీఆర్ఐ అధికారులు.

## నెల్లూరు జిల్లాలో మరో విషాదం

నెల్లూరు సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లాలో విషాదం నెలకొంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఒకే కుటుంబంలోని ముగ్గురు బలవన్మరణానికి పాల్పడగా అందులో ఇద్దరు చనిపోగా ఒక పాప పరిస్థితి విషమంగా ఉంది. నెల్లూరు జిల్లా దొరవారిసత్రం మండలం లో కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో కుటుంబం మొత్తం విషం సేవించారు. ఈ ఘటనలో మేర్లపాక మురళి (40), అయన తల్లి మస్తానమ్మ(60) చనిపోరు. కుమార్తె కావ్య శ్రీ (11) ఆస్పత్రిలో విషమ పరిస్థితుల్లో ఉన్నట్టు సమాచారం. మేర్లపాక మురళి ఇంట్లో ఏదో శబ్దాలు రావడంతో ఇది గమనించిన స్థానికులు ఇంటిదగ్గర కి వెళ్ళి చూడగా అప్పటికే మస్తానమ్మ(60) చనిపోయి ఉంది. మురళి(40) కావ్య శ్రీ(11) కొన ఊపిరితో ఉండడంతో వీరిని హుటాహుటిన సూళ్లూరుపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆసుపత్రిలో మురళి చనిపోయినట్టు డాక్టర్లు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం కావ్య శ్రీ ని నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించే పనిలో పోలీసులు వున్నారు.

## గిరి గ్రామ దర్శన్ లో పాల్గోన్న ముగ్గురు ఎంపీలు

విశాఖపట్నం సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్) అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి, కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగా గీత, కేరళ అల్తూర్ పార్లమెంట్ సభ్యులు రమ్య హరిదాస్ గురువారం నాడు అరకు వ్యాలీ మండలంలోని పెదలబుడు గ్రామంలోని " గిరి గ్రామ దర్శన్ " సందర్శించారు. ఈ సందర్భంగా గొడ్డేటి మాధవి మీడియాతో మాట్లాడుతూ కనుమరుగవుతున్న గిరిజన సాంప్రదాయాలను నేటి తరానికి కళ్లకు కట్టే విధంగా చూపించడమే ఈ " గిరి గ్రామ దర్శన్ " యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. కనుమరుగవుతున్న గిరిజన సంప్రదాయాలను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా అచ్చమైన గిరిజన సంప్రదాయాలను తిలకించాలి పర్యాటకులకు అరకు మండలం పెదలబుడు గ్రామంలోని " గిరి గ్రామ దర్శన్ " సందర్శించవలసిందిగా కోరారు. సహచర పార్లమెంటు సభ్యులతో కలిసి గిరిజన సాంప్రదాయ వేషధారణ ధరించిన అరకు ఎంపీ, అక్కడ ఏర్పాటుచేసిన గిరిజన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## ఏలూరు నగరంలో గుర్తు తెలియని శవం

ఏలూరు సెప్టెంబర్ 23, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా. ఏలూరు నగరంలోని జి ఎన్ టి రోడ్డు లో గల కాలువలో గుర్తు తెలియని మృతదేహం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ ఎస్సై కిషోర్ బాబు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని కాలువ నుండి బయటకు తీసి వివరాలు సేకరించారు. అయితే మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది.మృతదేహంవివరాలుతెలిసినవారురెండోపట్టణ సీఐ 9440796606, ఎస్ ఐ 8332959179 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు

# 27 వ తేదీన భారత్ బంద్ జయప్రదం చేయండి




### వివిధ రకాల పార్టీ నాయకుల విజ్ఞప్తి

నంద్యాల సెప్టెంబర్ 23, ( విభారె) :- . రైతు కార్మిక. ప్రజావ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 27న భారత్ బంద్ ను జయప్రదం చేయండి అని సిపిఐ.సిపిఎం. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ. టిడిపి.కాంగ్రెస్.పార్టీలు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వము అనుసరిస్తున్న రైతు. కార్మిక. ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 27 న భారత్ బంద్ ను జయప్రదం చేయాలని కోరు తూ సిపిఐ పార్టీ కార్యాలయంలో గురువారం నాడు రౌండ్ టేబుల్ సమావేశం సిపిఐ నాయకులు డి. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్. సిపిఎం పట్టణ కార్యదర్శి. టి . మద్దులు. టిడిపి నాయకులు నరేంద్రనాథ్ రెడ్డి. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు చౌడప్ప. కాంగ్రెస్ పార్టీ పట్టణ కోశాధికారి.ప్రసాద్. సిఐటియు పట్టణ అధ్యక్షులు. లక్ష్మణ్. సిఐటియు పట్టణ కార్యదర్శి కె ఎమ్. డి.గౌస్. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి జి.సోమన్న రైతు సంఘం కార్యదర్శి. పుల్లా. నరసింహులు. ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఏ. సుబ్బరాయుడు. ఆటో యూనియన్ కార్యదర్శి. రమేష్. డివైఎఫ్ఐ కార్యదర్శి. శివ. తదితరులు మాట్లాడుతూ కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం దేశాన్ని అంబానీ. అదాని.లాంటి కార్పొరేట్ సంస్థలకు. దారాదత్తం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలు అన్ని కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. దేశంలో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని రైతుల పంటలకు కనీస మద్దతు ధరలు చట్టంలో చేయాలని కార్పొరేట్ కంపెనీల నుండి భారత రైతాంగం కాపాడాలని కోరుతూ గత పది నెలలుగా లక్షలాది మంది రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం పోగా రోడ్లపై మేకులు కొట్టి ముళ్లకంచెలు వేసి అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న ఏమాత్రం వెనుకాడకుండా రైతులు ఆందోళన నిర్వహిస్తున్నారని అన్నారు. దేశంలో గత 70 ఏళ్లుగా దేశ ప్రజలు త్యాగాలతో నిర్మించబడ్డ రైల్వేలు బ్యాంకులు ఇన్సూరెన్స్ సంస్థలు బొగ్గుగనులు రోడ్లు టెలిఫోన్ ఎఫ్సీఐ ఓడరేవులు విశాఖ ఉక్కు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా దేశ సంపదను నరేంద్ర మోడీ ప్రభుత్వం డి. మార్ట్.వాల్ మార్ట్ వంటి కొద్ది మంది స్వదేశీ విదేశీ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో కరోనా మహమ్మారి వల్ల దేశ ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. అసంఘటిత రంగంలో వేల సంఖ్యలో పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి గతంలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగి లక్షలాదిమంది ఆకలిదప్పులతో అల్లాడి పోతుంటే వారికి ఇస్తామన్నా కుటుంబానికి 5 లక్షలు కూడా మొండిచేయి చూపడం విచారకరమని అన్నారు. వీటికి తోడు పెట్రోలు డీజిల్ వంటగ్యాస్ విద్యుత్ చార్జీలు నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు జీవించడమే దుర్మార్గమైన పరిస్థితి ఏర్పడింది. ప్రజల జీవించడమే దుర్మార్గంగా మారిపోయింది కార్పొరేట్ కంపెనీల అధిపతులు బడా వ్యాపారులు తప్ప ప్రజల పరిస్థితి లేకపోవడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను సెప్టెంబర్ 27వ తేదీ భారత్ బంధు సందర్భంగా నంద్యాల పట్టణము. లో ప్రభుత్వ రంగ సంస్థలు. విద్యాసంస్థలు. వ్యాపార సంస్థలు. సినిమా హాల్లు.ఆటోలు. ప్రైవేటు ఉద్యోగులు రైతులు కార్మికులు ప్రజలందరూ పాల్గొని బంద్ ను జయప్రదం చేయవలసింది గా నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో. కెవిపిఎస్ నాయకులు ఆల్ ఫ్రెండ్స్. కాంగ్రెస్ నాయకులు. షఢక్. సిపిఎం. సిపిఐ. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు అండగా కాంగ్రెస్ పార్టీయే తప్పా ఏ పార్టీ అయినా సాటిరాదు




### ఏపిసీసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్. చింతల మోహన్ రావు

నంద్యాలసెప్టెంబర్ 23, ( విభారె) :- నంద్యాల పట్టణంలో గురువారం నాడు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పంజాబ్ రాష్ట్రములో నూతన ముఖ్యమంత్రిగా దళిత సామాజిక వర్గానికి చెందిన యువ నాయకుడు వయస్సు45 సంవత్సరాల చరణ్ జిత్ సింగ్ చన్ని గారిని ఎంపిక చేసిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి సోనియా గాంధీ గారికి ఓ మన ప్రియతమ నేత శ్రీ రాహుల్ గాంధీ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము నూతన ముఖ్యమంత్రి గారికి శు భాకాంక్షలు తెలుపుతూ నంద్యాల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలియజేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితులకు ఎప్పుడు వెంటనే ఉ ంటాం అని శ్రీమతి సోనియా గాంధీ గారు నిరూపించారని ఆయన అన్నారు. దళితులు అభివృద్ధి చెందారు అంటే అది కాంగ్రెస్ పార్టీ వల్లనే అభివృద్ధి చెందారని గతంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు గానీ దళితులకు భూములు ఇవ్వడం గానీ కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అయింది అన్నారు. మరి ఈరోజు ఉన్నా పలు రాజకీయ పార్టీల అధినేతలు ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి గారి పార్టీ వచ్చే ఎన్నికలలో దళితులకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వగలుగుతాము అని చెప్పగలరా అని ప్రశ్నిస్తూ టిడిపి నేత చంద్రబాబునాయుడు గారు తెలుగుదేశం పార్టీ తరపున దళితులకు రాష్ట్ర అధ్యక్షులు గాని ముఖ్యమంత్రి పదవి గాని ఇవ్వగలుగుతాము అని చెప్పగలరా అని ప్రశ్నించారు. అలాగే మిగతా ఏ రాజకీయ పార్టీ అయినా కూడా దళితులను ముఖ్యమంత్రి చేయగలిగే సత్తా మీకు ఉందా అని ప్రశ్నించారు. నంద్యాల పట్టణ అధ్యక్షుడు దాసరి చింతల య్య మాట్లాడుతూ దళితులకు గతంలో ఇప్పుడు కూడా ఎప్పుడూ కూడా కాంగ్రెస్ పార్టీ మాత్రమే న్యాయం చేయగలుగుతుందన్నారు. ఈరోజు వచ్చిన రాజకీయ పార్టీలు వారి స్వలాభం కొరకు దళితులను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు ఆర్టీసీ ప్రసాద్ మాట్లాడుతూ పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా దళిత నాయకుడిని ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శ్రీమతి సోనియా గాంధీ గారికి యువ నాయకులు రాహుల్ గాంధీ గారికి యువ నాయకురాలు ప్రియాంక గాంధీ గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ గతంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కూడా దామోదరం సంజీవయ్య గారిని ముఖ్యమంత్రిగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేయగలిగింది ఇప్పుడు కూడా సోనియా గాంధీ గారు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది ఇతర పార్టీ నాయకులు మాయమాటలు చెప్పి నా దళిత సోదరులను మోసం చేస్తున్నారు దయచేసి కల్లబొల్లి మాటలకు నా దళిత సోదరులు మోసపోవద్దు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు దాసరి చింతయ్య, సీనియర్ నాయకులు దళిత నాయకులు ఆర్టీసీ ప్రసాద్, జిల్లా కోశాధికారి యస్ వైడి . ప్రసాద్, మైనారిటీ నాయకులు పాస్టర్ పాల్ రాజ్, ఫయాజ్, యువ నాయకులు యూత్ కాంగ్రెస్ పసుపుల అజయ్ కుమార్, నరేష్, బాలరాజు తదితరులు పాల్గొనడం జరిగిందన్నారు.

# పొదుపు మహిళలకు మరికొంత భరోసా


తుగ్గలి సెప్టెంబర్ 23, ( విభారె) : పొదుపు మహిళలకు మరింత భరోసా చేకూర్చే విధంగా ప్రభుత్వం పథకాలు ప్రవేశ పెడుతుందని తుగ్గలి ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్ పులిశేఖర్ తెలియజేసారు. గురువారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి లోని గ్రామ సచివాలయం నందు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుగ్గలి సచివాలయం పరిధిలోని ఇల్లాహి సెల్ఫ్ హెల్ప్ గ్రూపుకు 3,00,000 లోన్ మంజూరు చేపించడం జరిగిందని ఆయన తెలియజేశారు.పొదుపు మరియు లోన్స్ సక్రమంగా కట్టడం వలన కలిగే ప్రయెజనాలను, ఎస్.హెచ్.జి లకు ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు(ఆసరా, వైస్సార్ వడ్డీలేని రుణాలను)గురించి వివరించారు.ప్రతినెల ఖచ్చితంగా రెండు గ్రూప్ సమావేశాలు,పొదుపు కట్టడం,తీసుకున్న లోన్స్ కట్టడం,అవసరం అయినప్పుడు సంభందించిన గ్రూప్ యొక్క మొత్తాన్ని వాడుకోవాలని తెలియజేశారు. బ్యాంకు రుణాలకు ఎక్కువ వడ్డీతో కూడుకున్నవి కావున సంఘానికి సంబంధించిన మొత్తాన్ని ఉపయోగించుకోని,తీసుకున్న రుణాన్ని ఆర్థిక అభివృద్ధి కొరకు మాత్రమే ఉపయోగించుకోవాలని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పులి శేఖర్ గ్రూప్ సభ్యులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వివోఏ పార్వతి మరియు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలుచేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోండి ఎన్.ఎస్.యు.ఐ


ఎమ్మిగనూరు సెప్టెంబర్ 23, ( విభారె) రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 53ను దిక్కరించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎన్.ఎస్.యు.ఐ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విద్యార్థి నాయకుల సమావేశంలో వీరేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కొరకు జీవో నెంబర్ 53 తీసుకురావడం హర్షనీయమని, కానీ సీఎం జిల్లాలోనే ఆ జీవోను దిక్కరించి ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కర్నూలు జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల పర్యవేక్షణలో జిల్లా విద్యాశాఖాధికారుల పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లాలో ప్రధానంగా కార్పొరేట్ నారాయణ, శ్రీ చైతన్య, భాష్యం, రవీంద్ర భారతి కేశవరెడ్డి, నగరంలోని మాంటిస్సోరి ,,ఇండస్, రిడ్జ్,పలుబ్ పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 53 ప్రకారం విద్యార్థులు వారి తల్లిదండ్రుల దగ్గర నుండి వసూలు చేయవలసి ఉండగా అందుకు భిన్నంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నూతనంగా చేరిన విద్యార్థులకు అడ్మిషన్ టెస్ట్ లు నిర్వహిస్తూ వేలాది రూపాయలు



దుండు కుంటున్నారన్నారు. అదేవిధంగా పాఠ్య పుస్తకాల, నోట్ బుక్ లు, యూనిఫామ్, టై, బెల్ట్, షూ మొదలగు వాటిని విక్రయిస్తు? వ్యాపార కేంద్రాలుగా చేసుకున్నారు. సొంత ధరలు నిర్ణయించుకొని జీఎస్టీ, ఇతర పన్నులు ప్రభుత్వానికి చెల్లించకుండా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్నిసార్లు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన ఎటువంటి ఆకస్మిక తనిఖీలు, చర్యలు తీసుకోకపోవటంలో అంతర్యమేమిటన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి ఫీజుల నియంత్రణ కొరకు జీవో 53 అమలు అయ్యేటట్లు కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఎన్.ఎస్.యు.ఐ ఆధ్వర్యంలో తల్లితండ్రులను విద్యార్థులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. విలేకరుల సమావేశంలో ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధోని రాజు, రాష్ట్ర కార్యదర్శి హేశ్వరయ్య, రవి యాదవ్,మదన్, అజయ్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు,

# 'దూకుడు' దశాబ్ది ఉత్సవాలు షురూ

సోషల్ మీడియాలో ఈమద్య కాలంలో ప్రతీది పండుగ అన్నట్లుగా చేస్తున్నారు. దేశంలో ఇన్ని భాషల హీరోలు.. వారి అభిమానులు ఉన్నారు కాని సోషల్ మీడియాలో ఈ రేంజ్ లో రికార్డులు సాధించిన అభిమానులు మాత్రం లేరనే చెప్పాలి. పుట్టిన రోజులకు.. సినిమాలు విడుదల అయిన తేదీల్లో.. 50 డేస్ టు గో.. 100 డేస్ టు గో అంటూ ఇంకా రకరకాలుగా ట్రెండ్స్ చేస్తూ సోషల్ మీడియాలో తమ అభిమాన హీరోలను ఎప్పుడు కూడా అలా నిలబెడుతున్న వారు మన తెలుగు నెటిజన్స్. మహేష్ బాబు మరియు పవన్ కళ్యాణ్ అభిమానులు రెగ్యులర్ గా ట్విట్టర్ లో ఏదో ఒక విషయాన్ని ట్రెండ్ చేసేందుకు ప్రయత్నిస్తూనే ఉంటారు. ప్రస్తుతం మహేష్ బాబు అభిమానులు అతి పెద్ద ట్విట్టర్ ఉత్సవంకు సిద్దం అవుతున్నారు. మహేష్ బాబు కెరీర్ లో పలు బ్లాక్ బస్టర్ సినిమాలు ఉన్నాయి. అందులో ఒకటి దూకుడు. భారీ విజయాన్ని సొంతం చేసుకున్న దూకుడు సినిమా విడుదల అయ్యి రేపటికి పది సంవత్సరాలు పూర్తి అవ్వబోతుంది.2011 సెప్టెంబర్ 23న విడుదల అయిన




దూకుడు సినిమా బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ సక్సెస్ ను అప్పట్లో దక్కించుకుంది. మహేష్ బాబులోని మరో యాంగిల్ ను చూపించిన దూకుడు సినిమా పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అభిమానులు పండుగను మించి చేయాలని నిర్ణయించారు. అందుకే దశాబ్ది ఉ త్సవాలను నిర్వహించేందుకు సిద్దం అయ్యారు. దూకుడు కు సంబంధించిన ఫొటోలు వీడియోలు.. విశేషాలు ఇంకా ఎన్నో ఎన్నెన్నో రేపు షేర్ చేసుకునేందుకు గాను ప్లాన్ చేస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ సక్సెస్ ను దక్కించుకున్న సినిమాలకు ఈమద్య కాలంలో ఇలా ట్విట్టర్ లో ట్రెండ్ చేయడం.. హ్యాష్ ట్యాగ్స్ తో సందడి చేయడం కామన్ గా మారింది. దానికి రెట్టింపు అన్నట్లుగా దూకుడు దశాబ్ది ఉత్సవంను చేసేందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లుగా అభిమానులు పేర్కొన్నారు.బాక్సాఫీస్ ను షేక్ చేసిన దూకుడు మరోసారి రేపు ట్విట్టర్ ను షేర్ చేసేలా అభిమానులు రచ్చ చేసేందుకు సిద్దం అవుతున్నారు. బిగ్గెస్ట్ ట్రెండ్ ను చేసేందుకు మహేష్ బాబు అభిమానులు సిద్దం అయ్యారు. ఇప్పటి వరకు ఏ సినిమా కు కూడా ఇలాంటి ట్రెండ్ నమోదు కాలేదు అనుకునేలా ట్విట్టర్ లో ఈ కొత్త ట్రెండ్ ను రేపు నడిపించేందుకు గాను ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. దూకుడు సినిమా పదేళ్ల సందర్బంగా ట్విట్టర్ స్పేస్ ను కూడా ఏర్పాటు చేసి సినిమా కు సంబంధించిన అనుభవాలు అనుబంధాలను కూడా షేర్ చేసుకోబోతున్నట్లుగా చెబుతున్నారు. మొత్తానికి దూకుడు దశాబ్ది ఉత్సవాలు మరో రేంజ్ లో జరుగుతాయని అభిమానులు చాలా నమ్మకంతో చెబుతున్నారు.

# 'లవ్ స్టోరీ' కోసం రెండు క్లైమాక్సులను సెట్ చేశారట!

ప్రేమలో పడటానికి ఎవరి అనుమతి అవసరం లేదు .. కానీ ఆ ప్రేమ ఫలించాలంటే మాత్రం పెద్దల అనుమతి కావాలి. కులం .. గోత్రం .. వారం .. వర్జ్యం .. జాతకాలు చూసుకుని ప్రేమలో పడరు కనుక ఆ ప్రేమకు పెద్దల అనుమతి ఎలాగూ లభించదు. ఇటు ప్రేమను వదులుకోలేరు .. అటు పెద్దలను ఎదిరించలేరు. అలాంటి పరిస్థితుల్లో ఒక ప్రేమజంట ఏం చేసింది? ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంది? అనే ఆసక్తికరమైన మలుపులతో 'లవ్ స్టోరీ సినిమా రూపొందింది. చైతూ – సాయిపల్లవి జంటగా నటించిన ఈ సినిమాకి శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించాడు.నారాయణ దాస్ నారంగ్ – రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమాను ఈ




నెల 24వ తేదీన భారీస్థాయిలో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో .. ఈ సినిమా కోసం శేఖర్ కమ్ముల రెండు క్లైమాక్సులను అనుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ రెండు క్లైమాక్సులను ఆయన చిత్రీకరించాడట. ఒక క్లైమాక్స్ హ్యాపీ ఎండింగ్ తో కూడినదైతే మరో క్లైమాక్స్ విషాదాంతమని తెలుస్తోంది. చివరి నిమిషంలో ఏ క్లైమాక్సును ఆయన సెట్ చేస్తారనే విషయం ఎవరికీ తెలియదట. ఎడిటింగ్ రూమ్ నుంచి కూడా ఈ విషయం బయటికి రాలేదని చెప్పుకుంటున్నారు. ఏ క్లైమాక్స్ ను ఆయన ఫిక్స్ చేసి ఉంటాడనే విషయం ఇప్పుడు ఆసక్తికరంగా మారుతోంది.ఇక సెకండ్ వేవ్ తరువాత థియేటర్లకు చాలా సినిమాలు వచ్చాయి. అయితే జనంలో ఇంకా జంకు పోకపోవడం వలన కొన్ని సినిమాలకు మంచి టాక్ వచ్చినా వసూళ్లు గిట్టుబాటు కాలేదు. మరికొన్ని సినిమాలు థియేటర్లకు వచ్చి వెళ్లిన విషయం కూడా ఎవరికీ తెలియదు. కానీ 'లవ్ స్టోరీ' విషయంలో మాత్రం పరిస్థితి అలా లేదు. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగులు చాలా వేగంగా జరిగిపోతున్నాయి. ఊహించనంత వేగంగా టికెట్లు అమ్ముడవుతున్నాయట. ఇప్పటికే వీకెండ్ లో టికెట్లు దొరికే పరిస్థితి లేదని అంటున్నారు. ముఖ్యంగా నగరాల్లో హౌస్ ఫుల్స్ ఎక్కువగా పడనున్నాయని చెబుతున్నారు. శేఖర్ కమ్ముల టేకింగ్ పై గల నమ్మకం .. సాయిపల్లవి నటన పట్ల గల ఇష్టం .. పాటలు బాగుండటం ఈ సినిమా పట్ల ఈ స్థాయి క్రేజ్ పెరగడానికి కారణమని చెప్పుకుంటున్నారు.

# సినిమా.. సిరీస్ దేనికైనా రెడీ

మోస్ట్ హ్యాపెనింగ్ హీరోయిన్ సాయి పల్లవి వరుసగా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. టాలీవుడ్ మరియు కోలీవుడ్ తో పాటు ఇతర భాషల్లో కూడా మంచి గుర్తింపును దక్కించుకున్న సాయి పల్లవి ప్రస్తుతం వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్దం అయ్యింది. ఈమె నటించిన లవ్ స్టోరీ సినిమా ఈ



వారంలో థియేటర్ల ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్దం అయ్యింది. బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ సక్సెస్ ను దక్కించుకున్న ఫిదా కాంబో అవ్వడంతో లవ్ స్టోరీపై అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా లవ్ స్టోరీని దర్శకుడు శేఖర్ కమ్ముల భారీ ఎత్తున తెరకెక్కించాడని సమాచారం అందుతోంది. ఈ సినిమా విడుదల సందర్బంగా సాయి పల్లవి పలు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ వస్తోంది.తాజాగా ఒక ఇంటర్వ్యూలో సాయి పల్లవి తన ఫ్యూచర్ ప్లాన్స్ పై స్పందించింది. సినిమాలు మాత్రమే కాకుండా పాత్ర నచ్చితే ఖచ్చితంగా వెబ్ సిరీస్ లు చేసేందుకు తనకు ఎలాంటి ఇబ్బంది లేదని ప్రకటించింది. తాను హీరోయిన్ గా మాత్రమే కాకుండా నటిగా కొనసాగాలనుకుంటున్నట్లుగా చెప్పుకొచ్చింది. ఇప్పటికే ఒక వెబ్ సిరీస్ లో నటించి నటిగా తనను తాను ప్రూవ్ చేసుకున్న సాయి పల్లవి మరోసారి వెబ్ సిరీస్ కు ఓకే చెప్పబోతున్నట్లుగా ప్రకటించింది. ప్రస్తుతం ఒక వెబ్ సిరీస్ కథను వింటున్నట్లుగా చెప్పింది. లైన్ బాగా నచ్చింది. తప్పకుండా ఆకట్టుకునే విధంగా ఉంటుందనే నమ్మకం ఉంది. పూర్తి కథ కోసం వెయిట్ చేస్తున్నాను. ఇంకా కన్ఫర్మ్ అవ్వలేదు కాని వెబ్ సిరీస్ ఉంటుందనే నమ్మకం ఉందని చెప్పుకొచ్చింది.స్టార్ హీరోయిన్స్ వెబ్ సిరీస్ లపై ఆసక్తి చూపించడం లేదు. ఫేడ్ ఔట్ అవుతున్న ఇద్దరు ముగ్గురు తెలుగు హీరోయిన్స్ మాత్రమే వెబ్ సిరీస్ ల వెంట నడుస్తున్నారు. ఇలాంటి సమయంలో సాయి పల్లవి వెబ్ సిరీస్ లు అనడం చర్చనీయాంశంగా మారింది. వెబ్ సిరీస్ లు మరియు సినిమాలు రెండు కూడా సమాంతరంగా చేయాలంటే ఘట్స్ ఉండాలి. ముఖ్యంగా సినిమాలతో ఎక్కువ క్రేజ్ మరియు మనీ వస్తాయి. కనుక కమర్షియల్ గా ఆలోచించే హీరోయిన్స్ వెబ్ సిరీస్ లకు కాస్త దూరంగా ఉంటారు. అందుకే వెబ్ సిరీస్ లు మన సౌత్ లో చిన్న హీరోయిన్స్ కొత్త హీరోయిన్స్ మాత్రమే చేస్తున్నారు. సాయి పల్లవి మాత్రమే సినిమా కైనా.. సిరీస్ కైనా సిద్దం అన్నట్లుగా చెబుతోంది.

# నీకు స్పీడ్ ఎక్కువైంది.. చలాన్లు పడుతాయేమో చూసుకో




అన్‌రిచ్ నోర్ట్జే.. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ ప్రధాన బౌలర్లలో ఒకడిగా కొనసాగుతున్నాడు. అయితే ఇదే నోర్ట్జే ఐపీఎల్ 2020కి సంబంధించి జరిగిన వేలంలో అన్‌సోల్డ్ ఆటగాడిగా మిగిలిపోయాడు. కాగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడుతున్న క్రిస్ వోక్స్ గాయం కారణంగా లీగ్ నుంచి తప్పుకోవడంతో అతని స్థానంలో జట్టులోకి వచ్చాడు. ఈ సీజన్‌లో 16 మ్యాచ్‌లాడిన నోర్ట్జే 22 వికెట్లతో దుమ్మురేపాడు. కగిసో రబడ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు. ఆ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫైనల్లో ముంబై చేతిలో ఓడిపోయిన సంగతి తెలిసిందే.కట్‌చేస్తే.. ఈ ఏడాది ఐపీఎల్ 2021 సీజన్‌లో భారత్‌లో జరిగిన తొలి అంచె పోటీల్లో ఒక్క మ్యాచ్‌లోనూ నోర్ట్జేకు స్థానం దక్కలేదు. అయితే యూఏఈ గడ్డపై సీజన్ రెండో అంచె పోటీలు ప్రారంభం కాగానే మళ్లీ జట్టులోకి వచ్చిన నోర్ట్జే బుధవారం ఎస్‌ఆర్‌హెచ్‌తో జరిగిన మ్యాచ్‌లో అదరగొట్టాడు. 4 ఓవర్లు వేసిన నోర్ట్జే 12 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. డేవిడ్ వార్నర్, కేదార్ జాదవ్ వికెట్లను తీసిన నోర్ట్జే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. నోర్ట్జే నిన్నటి మ్యాచ్‌లో బౌలింగ్ చేసిన ప్రతీసారి 140 కిమీ కంటే ఎక్కువ వేగంతో బంతులు విసరడం విశేషం. ఈ సందర్భంగా టీమిండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా నోర్ట్జేను ఆటపట్టించాడు. నీకు ఓవర్ స్పీడ్ ఎక్కువైంది.. చలాన్లు పడుతాయేమో చూసుకో అంటూ అతని బౌలింగ్ స్పీడ్ ఫోటోను షేర్ చేస్తూ కామెంట్ చేశాడు.ఇక ఎస్‌ఆర్‌హెచ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్‌ఆర్‌హెచ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అబ్దుల్ సమద్ (21 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 17.5 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 139 పరుగులు చేసి గెలిచింది. శ్రేయస్ అయ్యర్ (41 బంతుల్లో 47 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సులు), ధావన్ (37 బంతుల్లో 42; 6 ఫోర్లు, 1 సిక్స్), పంత్ (21 బంతుల్లో 35 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్సులు) రాణించారు.

## పారాలింపిక్స్ కాంస్య పతక విజేతకు ఛాతీ నొప్పి

ఇటీవల ముగిసిన టోక్యో పారాలింపిక్స్‌లో పురుషుల హై జంప్‌లో కాంస్య పతకం సాధించిన శరద్ కుమార్‌కు ఛాతీలో నొప్పి రావడంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షలు నిర్వహించే క్రమంలో అతను గుండె వాపు సమస్యతో బాధ పడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని శరద్ కుమార్ స్వయంగా మీడియాకు వెల్లడించాడు.కాగా, పారాలింపిక్స్ కమిటీ ఆఫ్ ఇండియా(పీసీఐ) ఇటీవలే శరద్ కుమార్ పేరును ఈ ఏడాది మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు సిఫార్సు చేసింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190